# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

గుంటూరు - శనివారం 26 సెప్టెంబర్ 2026 | సంపుటి: 10 | సంచిక: 262 | పేజీలు: 8+4 | వెల రూ.5

GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA | HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM


11 నుంచి ఇంద్రకీలాద్రిపై

## శరన్నవరాత్రి మహోత్సవాలు



ఆర్జిత సేవా టికెట్ల విడుదల

7

హౌస్ హస్బెండ్‌గా ఎందుకుండకూడదు



2



# విదేశీ పర్యటనకు నారా కుటుంబం

## ప్రత్యేక విమానంలో సీఎం పయనం

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం కుటుంబ సమేతంగా మూడు రోజుల వ్యక్తిగత విదేశీ పర్యటనకు బయలుదేరి వెళ్లారు. శుక్రవారం ఉదయం ప్రత్యేక విమానంలో ఆయన విదేశాలకు ప్రయాణమయ్యారు. ఇది పూర్తిగా ఆయన వ్యక్తిగత, ప్రైవేట్ టూర్ కావడంతో చంద్రబాబు ఏ దేశానికి వెళ్తున్నారు, ఎక్కడ బస చేయనున్నారు అనే వివరాలను అధికారిక వర్గాలు అత్యంత గోప్యంగా ఉంచాయి.

**అమరావతి, మనం ప్రత్యేక ప్రతినిధి:** గత కొంతకాలంగా వరుస సమీక్షలు, జిల్లాల పర్యటనలు, పెట్టుబడుల సన్నాహక సమావేశాలతో బిజీగా గడిపిన ముఖ్యమంత్రి, కొద్దిరోజుల పాటు విశ్రాంతి కోసం చిన్న విదేశీ పర్యటనను ఎంచుకున్నట్లు తెలుస్తోంది. కేవలం ఆయన వ్యక్తిగత సిబ్బంది పర్యవేక్షణలోనే ఈ ప్రయాణ ఏర్పాట్లు పూర్తయ్యాయి.ఈ పర్యటన ముగించుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు సెప్టెంబర్ 28 సోమవారం నాటికి తిరిగి అమరావతికి చేరుకోనున్నారు. విదేశీ పర్యటన ముగిసి తిరిగి వచ్చిన మరుసటి రోజు నుంచే సెప్టెంబర్ 29న సీఎం షెడ్యూల్ పక్కాగా ఖరారైంది. సెప్టెంబర్ 29 నుంచి అక్టోబర్ 3 వరకు చంద్రబాబు రాష్ట్రవ్యాప్తంగా వరుస కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. సెప్టెంబర్ 29న విజయవాడలో జరిగే కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక 'మిషన్ కర్మయోగి' వర్క్‌షాప్‌కు హాజరవుతారు.

**రాయలసీమ గ్లోబల్ ఫ్రూట్ బౌల్ ప్రాజెక్ట్:** అక్టోబర్ 2న అన్నమయ్య జిల్లా మదనపల్లెలో కేంద్ర ప్రభుత్వ రూ. 40,000 కోట్ల భారీ మద్దతుతో ఏర్పాటు చేయనున్న అంతర్జాతీయ హార్టికల్చర్ హబ్ (రాయలసీమను గ్లోబల్ ఫ్రూట్ బౌల్గా మార్చే ప్రాజెక్ట్) శంకుస్థాపన కార్యక్రమంలో కేంద్ర మంత్రులతో కలిసి చంద్రబాబు పాల్గొననున్నారు. ప్రస్తుతం సీఎం విదేశాల్లో ఉన్నప్పటికీ, రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ఎప్పటికప్పుడు అధికారులకు టెలికాన్ఫరెన్స్ ద్వారా దిశానిర్దేశం చేసేందుకు అవసరమైన కమ్యూనికేషన్ ఏర్పాట్లను సీఎంఓ సిబ్బంది సిద్ధం చేశారు.



# రైతుకు ధర భరోసా.. వినియోగదారుడికి ధరల ఊరట



**రైతుబజార్లలో కిలో సన్నబియ్యం రూ.50.. ఉల్లిపాయలు రూ.35**

- ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా కిలో చక్కీ గోధుమపిండి రూ.27కు సరఫరా
- 8.81 లక్షల హెక్టార్లలో ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రణాళిక
- కొనుగోలు కార్యక్రమాలకు రూ.2,216.48 కోట్ల ఆర్థిక మద్దతు అవసరమని అంచనా
- ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనలతో సమగ్ర కార్యాచరణ: మంత్రి అచ్చెన్నాయుడు

**అమరావతి, సెప్టెంబర్ 25,(మనం ప్రత్యేక ప్రతినిధి):** రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించడం, వినియోగదారులకు నిత్యావసర వస్తువులను సరసమైన ధరలకు అందించడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. రైతుబజార్లు, ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా నిత్యావసర సరుకులను అందిస్తూ ప్రజలపై ధరల భారం తగ్గిస్తున్నామన్నారు. మరోవైపు మార్కెట్ అవసరాలకు అనుగుణంగా పంటల సాగును ప్రోత్సహించి, రైతులకు కొనుగోలు భరోసా కల్పించేలా సమగ్ర ప్రణాళిక రూపొందించినట్లు వెల్లడించారు. రాష్ట్రంలో ధరల పర్యవేక్షణ, నిత్యావసరాల ధరల స్థిరీకరణ, వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర, రబీ పంటల ప్రణాళికపై గురువారం రాత్రి మంత్రుల బృందం వర్చువల్ సమావేశం జరిగింది.వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్,

...మిగతా 2లో

# ఏఐ టెక్నాలజీతో ఏపీ టూరిజంలో కొత్త శకం

## పర్యాటక మంత్రి కందుల దుర్గేష్



**అమరావతికి, సెప్టెంబర్ 25,(మనం ప్రత్యేక ప్రతినిధి):** ఏఐ టెక్నాలజీతో ఏపీ టూరిజంలో సరికొత్త శకానికి నాంది పలుకుతున్నామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. సెప్టెంబర్ 27న రాజమహేంద్రవరంలోని మంజీరా కన్వెన్షన్ హాల్ వేదికగా 'డిజిటల్ అజెండా,ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టూ రీడిజైన్ టూరిజం' గ్లోబల్ థీమ్ ఆధారంగా ఆంధ్రప్రదేశ్ పర్యాటక ప్రాధికార సంస్థ(ఏపీటీఏ) ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నామని మంత్రి కందుల దుర్గేష్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాజమహేంద్రవరంలో జరిగే రాష్ట్ర స్థాయి వేడుకలకు పర్యాటక రంగానికి చెందిన ప్రముఖులు, టూర్ ఆపరేటర్లు, ఆతిథ్య రంగ ప్రతినిధులు, కంటెంట్ క్రియేటర్లు, టెక్నాలజీ ఇన్నోవేటర్లు హాజరుకానున్నారని తెలిపారు. పర్యాటక ప్రచారం, స్టేక్‌హోల్డర్ భాగస్వామ్యం, సాంస్కృతిక,కమ్యూనిటీ ఆధారిత కార్యక్రమాలతో ఈ వేడుకలు అంగరంగ వైభవంగా జరుపనున్నామని పేర్కొన్నారు.

వేడుకల్లో భాగంగా మంత్రి కందుల దుర్గేష్ అధ్యక్షతన అందరి

...మిగతా 2లో

# ప్రతి ఒక్కరికీ సంజీవని ఆరోగ్య కవచం!

- డిసెంబరు 10 నుంచి ట్రయల్ రన్
- జనవరి 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా పూర్తి స్థాయి అమలు
- ఇంటి వద్దకే 41 రకాల ఉచిత వైద్య పరీక్షలు
- 48 గంటల్లో వాట్సాప్‌కు రిపోర్టులు
- పరీక్షల నుంచి చికిత్స, మందుల వినియోగం వరకు పర్యవేక్షణ
- ధర్మవరం నుంచి 71 ఆరోగ్య రథాలకు మంత్రి సత్యకుమార్ యాదవ్ శ్రీకారం



ధర్మవరం, సెప్టెంబరు 25, మనం న్యూస్: ప్రజల ఆరోగ్య వివరాలను ఒకే చోట డిజిటల్గా నమోదు చేసి.. పరీక్షల నుంచి చికిత్స, చికిత్స అనంతర పర్యవేక్షణ వరకు వైద్య సేవలను అనుసంధానించే 'సంజీవని' కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయనున్నట్లు వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్య శాఖ మంత్రి, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ తెలిపారు. డిసెంబరు 10 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ట్రయల్ రన్ నిర్వహించి.. జనవరి 1 నుంచి పూర్తిస్థాయిలో అమలు చేస్తామని చెప్పారు. ప్రజల చెంతకే వైద్య సేవలను తీసుకెళ్లే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ఆరోగ్య రథాలను శుక్రవారం ధర్మవరం నుంచి ప్రారంభించారు. అనంతపురం,

...మిగతా 2లో

# మహిళల భద్రతకే కూటమి ప్రభుత్వ తొలి ప్రాధాన్యత

## రాష్ట్ర హోం మంత్రి అనిత

నక్కపల్లి , సెప్టెంబర్ 25(మనంన్యూస్): రాష్ట్రంలో మహిళల రక్షణ, భద్రతకే ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం పరిధిలోని రాజయ్యపేట, నక్కపల్లి ఆటో స్టాండ్లలో ఆటో డ్రైవర్లకు మహిళా భద్రత లక్ష్యంగా రూపొందించిన 'అభయ' కార్యక్రమంపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు.

ఈ సందర్భంగా హోం మంత్రి స్వయంగా ఆటోలు, ఆర్టీసీ బస్సులకు 'అభయ' భద్రతా స్టిక్కర్లను అంటించారు.₹ అనంతరం నక్కపల్లి వద్ద ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న మహిళలతో



మాట్లాడి 'అభయ' రక్షణ వ్యవస్థ పనితీరు, ఆపత్కాలంలో పోలీసుల సహాయం పొందే విధానంపై అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా హోం మంత్రి మాట్లాడుతూ: 'సమాజంలో మహిళలు నిర్భయంగా, ఆత్మగౌరవంతో జీవించేలా

...మిగతా 2లో



# మేక్ ఇన్ ఇండియాతో దేశీయ తయారీకి కొత్త ఊపిరి

## డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి

మార్కాపురం,సెప్టెంబర్25 (మనం న్యూస్): ప్రదాని నరేంద్ర మోదీ దూరదృష్టితో 2014లో ప్రారంభమైన 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమం నేటితో 12 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా దేశీయ తయారీ, పెట్టుబడులు, ఆవిష్కరణలు, ఎగుమతులకు ఇది బలమైన పునాదిగా ఎదిగిందని బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమం దేశ ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసిందని, దీనిని ముందుకు తీసుకెళ్తున్న నాయకుడు ప్రధాని నరేంద్ర మోదీ అని పేర్కొన్నారు. 'మేక్ ఇన్ ఇండియా' అంటే కేవలం దేశంలో ఉత్పత్తులు తయారు చేయడం మాత్రమే కాదని, భారత్ అభివృద్ధి, ఆర్థిక పురోగతికి అవసరమైన బలమైన మౌలిక వసతులు, పెట్టుబడులు, వ్యాపార అనుకూల వాతావరణం,

...మిగతా 2లో

# పంట నష్టాలపై తక్షణ సర్వే

- దెబ్బతిన్న రోడ్లకు అత్యవసర మరమ్మతులు
- నీరు నిలిచిన పొలాల్లో పంటల రక్షణకు చర్యలు చేపట్టాలి
- వర్షపు నీటిని సంరక్షించి..
- సాగు, తాగునీటి అవసరాలకు వినియోగించాలి

7

# ఏ ఒక్కరినీ విడిచిపెట్టం

## 'శాప్' దాడి ఘటనపై మంత్రి సవిత

- టీచర్లపై దాడి చేసిన వారంతా గొడ్డలి పార్టీ గూండాలే..
- మెగా డీఎస్సీలో అక్రమాలు జరగలేదని తేల్చిన కోర్టు
- చెంప పెట్టులాంటి తీర్పిచ్చినా సిగ్గులేని జగన్ బ్యాచ్

బుక్కరాయసముద్రం/ అనంతపురం, సెప్టెంబర్, 25, మనం న్యూస్: విజయవాడ శాప్ కార్యాలయంలో ఉపాధ్యాయులపై దాడి చేసిన వారిలో డీఎస్సీ అభ్యర్థులెవరూ లేరని, అంతా గొడ్డలి పార్టీ గూండాలేనని, ఏ ఒక్కరినీ విడిచిపెట్టే ప్రసక్తే లేదని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ,

...మిగతా 2లో



# జ్ఞానేశ్ రాజీనామా చేయాల్సిందే

**దేశవ్యాప్తంగా కాంగ్రెస్ ఆందోళనలు • పలుచోట్ల జల ఫిరంగుల ప్రయోగం**




2

## క్రిమినల్ ప్రాసిక్యూట్ చేయాలె

**సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేసిన న్యాయవాది**

**ఆయన జెన్-జీ ఓటు హక్కును అడ్డుకుంటున్నరు**

**ఢిల్లీ, సెప్టెంబర్ 25:** 'సర్' అంశంపై ఎన్నికల కమిషన్ లో విభేదాలు ఏర్పాడ్డాయంటూ వచ్చిన వార్తలపై రేగిన రాజకీయ దుమారం తీవ్రమవుతోంది. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ అభిశంసనకు విపక్షాలు సిద్ధమవుతుండగా.. ఈ వ్యవహారంపై సుప్రీంలో కేసు కూడా దాఖలైంది. జ్ఞానేశ్ కు వ్యతిరేకంగా సర్వోన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలైంది. ఆయనపై క్రిమినల్ ప్రాసిక్యూషన్ కోరుతూ

...మిగతా 2లో

## సీఈసీ రాజీనామాకు ఇంక మిగిలింది 24 గంటలే

**ప్రతిపక్షాలు ఎన్నికల్లో పోటీ చేయొద్దు: అభిజీత్ దీప్కే**

**హైదరాబాద్, సెప్టెంబర్ 25:** ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) విషయంపై ఎన్నికల సంఘంలో విభేదాలున్నట్లు వార్తలు వచ్చిన నేపథ్యంలో సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. దీనిపై కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే కీలక వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల ప్రక్రియలో అవకతవకలు జరుగుతున్నాయని ప్రతిపక్షాలు భావిస్తే.. ఇకపై ఎన్నికల్లో

...మిగతా 2లో

# కష్టకాలంలో రైతన్న వెన్నంటి ఉంటాం

మంత్రి కందుల దుర్గేష్

2

# యుద్ధాన్ని కోరుకుంటలేం

## ఇరాన్ అధ్యక్షుడు పెజిష్కియాన్



**టెహ్రాన్, సెప్టెంబర్ 25:** ఇరాన్-అమెరికా మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. యుద్ధం ఎప్పుడు ముగియాలో నిర్ణయించాల్సింది అమెరికానేనని స్పష్టం చేశారు. యుద్ధాన్ని కొనసాగించాలని తాము కోరుకోవట్లేదన్నారు. దీన్ని ఎలా ముగించాలనే విషయంలో ఇరుపక్షాల మధ్య ఏకాభిప్రాయం లేదని చెప్పారు. అయితే.. అగ్రరాజ్య ఒత్తిడికి టెహ్రాన్ ఎప్పటికీ లొంగబోదన్నారు. తమ దేశంలోని ఆర్థిక ఇబ్బందులను సాకుగా చూపి.. అమెరికా, ఇజ్రాయెల్, యూరప్ నాయకులు అశాంతి వాతావరణాన్ని సృష్టిస్తున్నారని ఆరోపించారు. ఇరాన్‌కు గానీ.. అమెరికాకు గానీ సంఘర్షణలు

...మిగతా 2లో

# కొసరి కొసరి వడ్డించిన ట్రంప్

## జిన్‌పింగ్‌కు ప్రత్యేక డిన్నర్



**వాషింగ్టన్, సెప్టెంబర్ 25:** అమెరికా పర్యటనకు విచ్చేసిన చైనా అధినేత జిన్‌పింగ్‌కు అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దంపతులు అధికారిక విందు ఇచ్చారు. వైట్‌హౌస్‌లోని ఈస్ట్ రూమ్‌లో జరిగిన ఈ విలాసవంతమైన విందులో జిన్‌పింగ్ కోసం ప్రత్యేక వంటకాలు సిద్ధం చేశారు. ఇందుకు సంబంధించిన మెనూను వైట్‌హౌస్ విడుదల చేసింది. అమెరికన్, చైనీస్ రుచుల కలయికతో చేసిన వంటకాలు అందులో ఉన్నాయి. మెయిన్ కోర్సులో నువ్వులతో చేసిన బాస్ చేప, క్రిస్పీ బాక్ చోయ్ (ఒక రకమైన చైనీస్ క్యాబేజీ), పసుపు

...మిగతా 2లో

# రైతుకు ధర భరోసా..వినియోగదారుడికి ధరల ఊరట

(మొదటి పేజీ తరువాయి)

ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సమావేశంలో పాల్గొన్నారు. చర్చించిన అంశాలు, రూపొందించిన ప్రతిపాదనలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లినట్లు అచ్చెన్నాయుడు తెలిపారు. ఆయన ఆదేశాలు, సూచనల మేరకు రైతులు, వినియోగదారుల ప్రయోజనాలను పరిరక్షించేలా కార్యాచరణ చేపట్టామన్నారు.

వినియోగదారులకు నాణ్యమైన సరుకులను అందించేందుకు రైతుబజార్లలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్ల ద్వారా కేఎన్ఎం, బీపీటీ వంటి సూపర్ ఫైన్ రకం బియ్యాన్ని కిలో రూ.50కు విక్రయిస్తున్నట్లు మంత్రి వివరించారు. రాష్ట్రంలోని అన్ని రైతుబజార్ల ద్వారా ఉల్లిపాయలను కిలో రూ.35కు అందిస్తున్నామన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా నాణ్యమైన పామాయిల్,



కందిపప్పును సబ్సిడీ ధరలకు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. చక్కీ గోధుమపిండిని కూడా కిలో రూ.27కు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. పాలు, బియ్యం, చికెన్, వంటనూనెలు, కందిపప్పు, మినుములు, వేరుశనగ, ఉల్లిపాయలు, గుడ్లు, టమాటా, అరటి తదితర 14 ప్రధాన వస్తువుల ధరలను నిరంతరం పర్యవేక్షించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. రాష్ట్ర వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ)లో ఆహార వస్తువులకు కేటాయించిన మొత్తం వెయిటేజీలో వీటి వాటా 57.37 శాతంగా ఉందన్నారు. అందువల్ల ఆయా వస్తువుల ఉత్పత్తి, సరఫరా, నిల్వలు, మార్కెట్ ధరలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.

# ఏఐ టెక్నాలజీతో ఏపీ టూరిజంలో కొత్త శకం

(మొదటి పేజీ తరువాయి)

భాగస్వామ్యంతో పర్యాటక రంగంలో నూతన ఆలోచనలను అమలు చేసేందుకు చర్యలు తీసుకోనున్నారు. ఆచరణాత్మక ఆలోచనలను సేకరించడం, ఆంధ్రప్రదేశ్ పర్యాటక వృద్ధి ప్రయాణంలో స్టేక్హోల్డర్ల భాగస్వామ్యాన్ని బలోపేతం చేసేందుకు పర్యాటక ప్రచారం, పర్యాటక గమ్యస్థానాల మార్కెటింగ్, కంటెంట్ క్రియేషన్, డిజిటల్, ఏఐ ఆధారిత పర్యాటక పరిష్కారాలపై, ఇండస్ట్రీ కొలాబరేషన్ల పలు కన్సల్టేటివ్ వర్క్షాప్లను ఈ వేదికపై నిర్వహించనున్నామని ఆయన తెలిపారు.

సోషల్ మీడియా ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక క్రియేటర్, ఇన్ఫ్లుయెన్సర్ ఔట్రీచ్ కార్యక్రమాలను చేపట్టనున్నామని వెల్లడించారు. గోదావరి ప్రాంతంలో క్యూరేటెడ్ ఫామిలియరైజేషన్ ట్రిప్స్ కోసం సెప్టెంబర్ 26న విశాఖపట్నం నుండి హాప్-ఆన్ హాప్-ఆఫ్ డబుల్ డెక్కర్ బస్సులను రాజమండ్రికి తీసుకురానున్నట్లు పేర్కొన్నారు. తద్వారా గోదావరి పరివాహక ప్రాంతంలోని విభిన్న పర్యాటక విశేషాలను అనుభవించి డాక్యుమెంట్ చేసి సోషల్ మీడియా వేదికగా ఏపీ పర్యాటక ప్రాంతాల గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పేందుకు కంటెంట్ క్రియేటర్లకు, ఫోటోగ్రాఫర్లకు,స్టోరీ టెల్లర్లు, ఇన్ఫ్లుయెన్సర్లకు అద్భుతమైన అవకాశమని మంత్రి దుర్గేష్ తెలిపారు.

గోదావరి పుష్కరాలు 2027కి సన్నాహకంగా ‘ది గోదావరి కాల్స్‘అనే ఫ్లాగ్షిప్ పర్యాటక ప్రచార కార్యక్రమానికి ఈ వేడుకల్లో ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు మంత్రి దుర్గేష్ తెలిపారు. గోదావరి ప్రాంత సాంస్కృతిక, ఆధ్యాత్మిక, ప్రకృతి సౌందర్యాన్ని ఈ వేదిక ద్వారా ప్రపంచానికి పరిచయం చేసేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ఈ రాష్ట్ర స్థాయి వేడుకల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్ గొప్ప కళా వైభవాన్ని చాటేలా సాంస్కృతిక ప్రదర్శనలు, ఆంధ్రప్రదేశ్ టూరిజం అవార్డ్స్ 2026 ప్రదానోత్సవం జరగనున్నాయని, అలాగే పర్యాటక అనుభవాలను మెరుగుపరచడానికి కీలకమైన కొత్త ప్రాజెక్టులను ప్రారంభించనున్నామన్నారు. ఇదే క్రమంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు తమ పరిధిలోని పర్యాటక ఆకర్షణలు, సాంస్కృతిక వారసత్వం,ప్రత్యేక అనుభవాలను హైలైట్ చేస్తూ ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలను నిర్వహించాలని సూచించామన్నారు. ఈ కార్యక్రమాల ద్వారా రాష్ట్రంలో పర్యాటక రంగం మరింతగా వృద్ధి చెందుతుందని ఆశిస్తున్నట్లు మంత్రి దుర్గేష్ వెల్లడించారు.

# అమ్మాయికి వేధింపులు

- బిహార్లో మరో ఘటన
- కలకలం సృష్టిస్తున్న వరుస వేధింపుల ఘటనలు

**పట్నా, సెప్టెంబర్ 25:** బిహార్లో అమ్మాయిలపై వరుస వేధింపుల ఘటనలు తీవ్ర కలకలం సృష్టిస్తున్నాయి. ఇప్పటికే జాముయి, సమస్తీపూర్లలో మైనర్ బాలికలను ఆకతాయిలు వేధించగా.. తాజాగా బంకా జిల్లాలోనూ ఇలాంటి ఘటనే వెలుగుచూసింది. జిల్లాలోని మందర్ హిల్ వద్ద ఓ అమ్మాయిపై ఆరుగురు వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. బాధితురాలితో వారు అసభ్యంగా ప్రవర్తించడంతో పాటు ఆమెను కొట్టారు. సెప్టెంబరు 3న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ గా మారడంతో పోలీసులు సుమోటోగా దర్యాప్తు చేపట్టారు. నిందితుల కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల జాముయి జిల్లాలో స్నేహితులైన ఇద్దరు టీనేజర్లు.. కోచింగ్ సెంటర్కు వెళ్లి వస్తుండగా రోడ్డుపైనే దుండగులు అడ్డగించిన సంగతి తెలిసిందే. బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారు. గట్టిగా పట్టుకుని లాక్కెళ్లారు. అభ్యంతరకరంగా తాకారు. ఈ ఘటన మరువక ముందే.. సమస్తీపూర్ జిల్లాలోనూ ఓ టీనేజీ అమ్మాయి, అబ్బాయి కలిసి రోడ్డుపై నడుచుకుంటూ ఫొటోలు తీసుకుంటుండగా కొందరు ఆకతాయిలు అడ్డగించి అమానుషంగా ప్రవర్తించారు.

# ప్రతి ఒక్కరికీ సంజీవని ఆరోగ్య కవచం!

(మొదటి పేజీ తరువాయి)

శ్రీ సత్యసాయి జిల్లాలకు చెందిన 71 ఆరోగ్య రథాలకు మంత్రి పచ్చజెండా ఊపారు.రూ.5 వేల వరకు ఖర్చయ్యే పరీక్షలూ ఉచితమే!ఆరోగ్య రథాల్లో 41 రకాల వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహించనున్నట్లు మంత్రి తెలిపారు. సాధారణంగా రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు ఖర్చయ్యే పరీక్షలను సైతం ఉచితంగా అందిస్తామని చెప్పారు. డయాబెటిస్, రక్త పరీక్షలు, కిడ్నీ, కాలేయ సంబంధిత పరీక్షలు తదితరాలు ఇందులో ఉంటాయని వివరించారు.

పరీక్షలు పూర్తయిన 48 గంటల్లోపు రిపోర్టులను వాట్సాప్ ద్వారా పంపుతామని తెలిపారు. ఆరోగ్య సమస్య గుర్తించిన తర్వాత రిపోర్టు ఇచ్చి వదిలేయకుండా.. సంబంధిత వ్యక్తికి అవసరమైన వైద్య సేవలు అందేలా తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు.



**ప్రతి వ్యక్తికీ ప్రత్యేక ఆరోగ్య ప్రొఫైల్**

వ్యక్తిగత వైద్య చరిత్రను డిజిటల్గా నమోదు చేసే విధానాన్ని అందుబాటులోకి తెస్తున్నామని మంత్రి తెలిపారు. గత పరీక్షల ఫలితాలు, రక్తపోటు, రక్తంలో చక్కెర, రక్త గ్రూపు, గతంలో తీసుకున్న చికిత్స, ప్రస్తుతం వినియోగిస్తున్న మందుల వివరాలు నమోదు చేస్తామని చెప్పారు.దీంతో ప్రతి సారీ పాత వైద్య నివేదికలను వెంట తీసుకెళ్లాల్సిన అవసరం ఉండదన్నారు. గత వైద్య చరిత్రను పరిశీలించిన వైద్యులు.. దాని ఆధారంగా తదుపరి చికిత్సను కొనసాగించే అవకాశం ఉంటుందని తెలిపారు.

**‘సంజీవని’లో ఆరోగ్య వివరాలన్నీ ఒక్కచోటే**

ప్రతి వ్యక్తి ఆరోగ్యానికి సంబంధించిన సమాచారాన్ని ఒకే చోట అందుబాటులో ఉంచేందుకు ‘సంజీవని’ డిజిటల్ వేదికను రూపొందిస్తున్నట్లు మంత్రి చెప్పారు. పరీక్షల ఫలితాలు, వైద్యుల సూచనలు, అపాయింట్మెంట్లు, మందుల వినియోగం, తదుపరి పరీక్షల వివరాలను ఇందులో నమోదు చేస్తామన్నారు.‘‘ప్రతి వ్యక్తికి ఒక బయోడేటా ఉన్నట్టే.. ఇకపై ఆరోగ్య ప్రొఫైల్ కూడా ఉంటుంది’’ అని మంత్రి పేర్కొన్నారు. గత అనారోగ్యాలు, చికిత్స వివరాలు, ప్రస్తుతం వాడుతున్న మందులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తదుపరి వైద్య సేవలకు సంబంధించిన సమాచారం ఇందులో అందుబాటులో ఉంటుందని తెలిపారు.

# మేక్ ఇన్ ఇండియాతో దేశీయ తయారీకి కొత్త ఊపిరి

(మొదటి పేజీ తరువాయి)

సాంకేతికత, ఆవిష్కరణలకు ఊతమిచ్చే పునాదిని నిర్మించడం కూడా దాని లక్ష్యమని తెలిపారు. ఎలక్ట్రానిక్స్, మొబైల్ తయారీ, ఫార్మాస్యూటికల్స్, ఆటోమొబైల్స్, రక్షణ, ఉక్కు తదితర రంగాల్లో దేశీయ తయారీ సామర్థ్యాలు పెరుగుతున్నాయని అన్నారు. ‘మేక్ ఇన్ ఇండియా’ స్ఫూర్తితో భారత్ను ప్రపంచ స్థాయి తయారీ కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోందని, ఆత్మనిర్భర్ భారత్ నిర్మాణంలో ఈ కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తోందని డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు.



# మహిళల భద్రతకే కూటమి ప్రభుత్వ తొలి ప్రాధాన్యత

(మొదటి పేజీ తరువాయి)

పూర్తి స్థాయి రక్షణ కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం. మహిళల రక్షణలో ఆటో డ్రైవర్లు, ప్రజారవాణా సిబ్బంది కీలక పాత్ర పోషించాలి. అనుమానాస్పద పరిస్థితులు, ఆపదలు ఎదురైనప్పుడు మహిళలకు అండగా నిలవాలి. కూటమి ప్రభుత్వం మహిళా భద్రత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదు. బాధితులు వెంటనే పోలీసులను సంప్రదించేలా ‘అభయ’ కార్యక్రమం ద్వారా గ్రామ స్థాయి వరకు పూర్తి భరోసా కల్పిస్తున్నాం.

ఈ కార్యక్రమంలో నర్సీపట్నం సబ్ డివిజన్ డీఎస్పీ పోతిరెడ్డి శ్రీనివాసరావు, నక్కపల్లి సీఐ మురళి, ఎస్సై సన్నిబాబు, ఇతర పోలీసు అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో ఆటో డ్రైవర్లు, ప్రజలు పాల్గొన్నారు.



# ఏ ఒక్కరినీ విడిచిపెట్టం

(మొదటి పేజీ తరువాయి)

చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత హెచ్చరించారు. కోర్టు చెంప పెట్టులాంటి తీర్పు ఇచ్చినా, జగన్, గొడ్డలి పార్టీ నాయకులు సిగ్గు లేకుండా మెగా డీఎస్సీపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. పోలీసులంటే సీఎం చంద్రబాబుకు అపారమైన గౌరవమని, అందుకే విధి నిర్వహణలో వారికి పూర్తి స్వేచ్ఛనిచ్చారని తెలిపారు. శుక్రవారం బుక్కరాయసముద్రం మండలం, జంతులూరు లోని 14వ బెటాలియన్ లో ఏపీఎస్పీ ఎస్సీటీపీసీ 2025-26 బ్యాచ్ కు చెందిన 187 మంది శిక్షణార్థుల పాసింగ్ అవుట్ పెరేడ్ కార్యక్రమ అనంతరం ఎమ్మెల్యే బండారు శ్రావణితో కలిసి మంత్రి సవిత విలేకరులతో మాట్లాడారు. గత వైసీపీ పాలనలో పోలీసులు తీవ్ర ఒత్తిడితో విధులు నిర్వర్తించేవారన్నారు. సీఎం చంద్రబాబుకు పోలీసులపై అపారమైన గౌరవం ఉందన్నారు. శాంతిభద్రతలో పోలీసులే కీలకమని భావించి, వారికి పూర్తి స్వేచ్ఛనిచ్చారన్నారు. ఏటా జాబ్ క్యాలెండర్ రిలీజ్ చేస్తామని, దాంట్లో భాగంగా పోలీసు శాఖ పోస్టులు కూడా భర్తీ చేస్తామని తెలిపారు. ఇటీవల 2,050 ఎస్ఐ, ఇతర కానిస్టేబుళ్ల పోస్టులకు నోటిఫికేషన్ జారీచేశామన్నారు. కూటమి ప్రభుత్వం రాగానే, 6,100 పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాలు భర్తీచేశామన్నారు. వారిలో 187 మందికి



జంతులూరు లోని 14వ బెటాలియన్ నందు ఏపీఎస్పీ ఎస్సీటీపీసీలో పాసింగ్ అవుట్ పెరేడ్ కార్యక్రమం ఘనంగా జరిగిందని మంత్రి సవిత తెలిపారు.

**వారంతా ‘గొడ్డలి’ గూండాలే...**

విజయవాడలోని శాప్ కార్యాలయంలోని ఉపాధ్యాయులపై దాడి చేసిన వారిలో గొడ్డలి పార్టీ గూండాలేనని మంత్రి సవిత స్పష్టం చేశారు. ఉపాధ్యాయులపై దాడి చేసిన ఏ ఒక్కరినీ విడిచిపెట్టే ప్రసక్తే లేదని, చట్టపరంగా కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. డీఎస్సీలో ఎటువంటి అక్రమాలు జరగలేదని కోర్టు చెంప పెట్టులాంటి తీర్పు ఇచ్చినా, జగన్, గొడ్డలి పార్టీ నాయకులు సిగ్గుపడడం లేదన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే, చూస్తూ ఊరుకోబోమని, ఉక్కుపాదం మోపుతామని మంత్రి సవిత హెచ్చరించారు.

# కొసరి కొసరి వడ్డించిన ట్రంప్

(మొదటి పేజీ తరువాయి)

గుమ్మడితో చేసిన వెలౌట్, అడవి పుట్టగొడుగులతో చేసిన ఫికాసీ, క్రిస్పీ పాన్సెట్టా, రోస్టెడ్ గార్డెన్ ఎగ్ప్లాండ్ వంటివి ఏర్పాటు చేశారు. డెజర్ట్సలో వెనీలా క్రిమెక్స్, వైట్హౌస్ హనీ క్రీమ్, వాల్నట్ ఫ్రాంగీపేన్, చెర్రీ కాన్ఫిట్ వంటివి అందించారు. ఇక, ఈ కార్యక్రమంలో జిన్పింగ్కు ట్రంప్ అరుదైన కానుకనిచ్చారు. అమెరికా జాతీయ బాల్ ఈగల్ విగ్రహాన్ని బహుమతిగా అందజేశారు. మూడు అడుగుల ఎత్తు ఉన్న ఈ గిఫ్ట్ను విందు సమయంలో అతిథుల ముందు ప్రదర్శించారు. స్వేచ్ఛ, స్ఫూర్తికి చిహ్నమైన ఈ విగ్రహం.. చైనాలో ప్రత్యేకంగా నిలుస్తుందని ట్రంప్ ఆకాంక్షించారు. విందు అనంతరం శ్వేతసౌధంలో నూతనంగా నిర్మిస్తోన్న బాల్రూమ్ను చూపించారు. ‘ఈ గదిలోకి వచ్చిన మొదటి విదేశీ నేత మీరే’ అంటూ ట్రంప్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.

**హాజరైన టెక్ దిగ్గజాలు..**

ఈ విందుకు అమెరికా టెక్ రంగానికి చెందిన పలువురు ప్రముఖులు హాజరయ్యారు. టెస్లా అధినేత ఎలాన్ మస్క్, యాపిల్ మాజీ సీఈవో టిమ్ కుక్, ఎన్వీడియా సీఈఓ జెన్సెన్ హువాంగ్, ఓపెన్ఏఐకు చెందిన శామ్ ఆల్ట్మన్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# యుద్ధాన్ని కోరుకుంటలేం

(మొదటి పేజీ తరువాయి)

ప్రయోజనకరం కావని వ్యాఖ్యానించారు. ఈ ఏడాది చివరి నాటికి యుద్ధం ముగుస్తుందా..? అని మీడియా అడిగిన ప్రశ్నకు బదులిస్తూ.. ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఓ వైపు అమెరికా-ఇరాన్ ఘర్షణలతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతుంటే.. మరోవైపు



యెమెన్లోని హూతీ తిరుగుబాటుదారులు సౌదీ అరేబియాపై దాడులను ఉద్ధృతం చేస్తున్నారు. తాజాగా మరోసారి హూతీలు రియాద్లోని పలు ప్రాంతాలను లక్ష్యంగా చేసుకున్నారు. సౌదీలోని అతిపెద్ద చమురు శుద్ధి కేంద్రాల్లో ఒకటైన అరామ్కో రిఫైనరీపై డ్రోన్, క్షిపణి దాడులు జరిగినట్లు తెలుస్తోంది. రాస్ తనురాలోని ఈ రిఫైనరీ మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకున్నట్లు హూతీ సైనిక ప్రతినిధి ప్రకటించారు. ఈ దాడుల్లో పలువురు ప్రాణాలు కోల్పోయినట్లు చెప్పారు. దక్షిణ తైఫ్ ప్రావిన్స్, ఎర్ర సముద్ర తీరంలోని యాన్బు ప్రాంతాల్లో హూతీలు ప్రయోగించిన ఆరు బాలిస్టిక్ క్షిపణులను తమ బలగాలు అడ్డుకున్నట్లు సౌదీ అరేబియా ప్రకటించింది. ఈ దాడుల నేపథ్యంలో పవిత్ర మక్కా నగరంతో సహా పలు ప్రాంతాలకు అత్యవసర హెచ్చరికలు జారీ చేసింది.

# హౌస్ హస్బెండ్గా ఎందుకుండకూడదు

## భర్తలకు మద్రాస్ హైకోర్టు మదురై ధర్మాసనం ప్రశ్న

**మదురై, సెప్టెంబర్ 25:** మహిళలు హౌస్ వైఫులుగా ఉన్నట్లు పురుషులు హౌస్ హస్బెండులుగా ఎందుకుండకూడదని మద్రాస్ హైకోర్టు మదురై ధర్మాసనం ప్రశ్నించింది. తమ కెరీర్ కు వివాహం అడ్డంకిగా ఉందని భావించి వైవాహిక జీవితానికి దూరమయ్యే మహిళల సంఖ్య పెరుగుతోందని అభిప్రాయపడింది. ఈ పరిస్థితి మారాలంటే ఇంటి బాధ్యతలను



పంచుకునేందుకు భర్త ముందుకు రావాలని సూచించింది. ఓ విడాకులకు సంబంధించిన కేసు విచారణ సందర్భంగా న్యాయమూర్తులు జస్టిస్ జీఆర్ స్వామినాథన్, జస్టిస్ సుమతిలతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. తిరువణ్ణామలైకి చెందిన యువతీయువకులు 2011లో వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు. భర్త వైద్యుడు కాగా ఉన్నత చదువులకు వెళ్లడంతో భార్య తన పుట్టింట్లో ఉన్నారు.

2020 తర్వాత కలిసి ఉన్నప్పుడు గొడవలు రావడంతో భార్య తన వైవాహిక హక్కులను సంరక్షించాలని కోరుతూ కోర్టును ఆశ్రయించారు. భర్త విడాకులు కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్లను ఫ్యామిలీ కోర్టు కొట్టేయడంతో ఇద్దరూ మదురై ధర్మాసనంలో అప్పీల్ చేశారు. భర్త రూ.2.50 కోట్లు ఇచ్చేందుకు అంగీకరించడంతో పరస్పర అంగీకారంతో విడాకులు మంజూరయ్యాయి. ఈ కేసు విచారణ సందర్భంగా వివాహ వ్యవస్థలో భార్యాభర్తల బాధ్యతలపై ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది.

# కష్టకాలంలో రైతన్న వెన్నంటి ఉంటాం

- మంత్రి కందుల దుర్గేష్

**నిడదవోలు/అమరావతి, సెప్టెంబర్,25,(మనం న్యూస్):** భారీ వర్షాల ధాటికి నిడదవోలు నియోజకవర్గంలో దెబ్బతిన్న పంట పొలాలను రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖామాత్యులు కందల దుర్గేష్ క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించారు. నియోజకవర్గం నిడదవోలు రూరల్ మండల పరిధిలోని తీరుగూడెం, ఆంజనేయపురం, కంసాలిపాలెం, రావిమెట్ల, శంకరాపురం, తిమ్మరాజుపాలెం తదితర గ్రామాల్లో పర్యటించి ముంపునకు గురైన సుమారు 370 హెక్టార్లు (926 ఎకరాలు) పంట పొలాలను పరిశీలించారు.ఈ సంక్షిష్ట సమయంలో రైతులకు ధైర్యం కల్పించేందుకు నేరుగా పొలాల్లోకి, రైతుల వద్దకే వెళ్లిన మంత్రి దుర్గేష్.. వారి సమస్యలను సానుభూతితో ఆలకించారు. ఏయే ప్రాంతాల్లో ఎంత మేర పంట నష్టం వాటిల్లిందనే వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ‘అన్నదాతలు ఎవరూ దిగులు చెందవద్దు.. ప్రభుత్వం ఎప్పుడూ మీకు అండగా ఉంటుంది‘ అని మంత్రి దుర్గేష్ రైతులకు భరోసానిచ్చారు. గత ఏడాది ఇదే ప్రాంతంలో ముంపు సమస్య తలెత్తినప్పుడు కూటమి ప్రభుత్వం తక్షణమే స్పందించి పరిహారం అందించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. రైతు బాగుంటేనే



దేశం బాగుంటుందనే నినాదంతో ప్రభుత్వం ముందుకెళ్తోందని స్పష్టం చేశారు.

పర్యటనలో భాగంగా కంసాలిపాలెం-మాధవరం వద్ద ఆగి ఎర్రకాలువ ఉధృతిని పరిశీలించారు. పంట నష్టం అంచనా నివేదికలను ప్రభుత్వానికి పంపేటప్పుడు అత్యంత పారదర్శకంగా వ్యవహరించాలని, ముంపునకు గురైన ప్రతి ఒక్క రైతుకూ న్యాయం జరిగేలా ప్రతి హెక్టారు నష్టపరిహారాన్ని అందజేయాలని అధికారులను ఆయన ఆదేశించారు.ఎర్రకాలువ కారణంగా తరచూ ముంపునకు గురవుతున్న సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు కూటమి ప్రభుత్వం ఇప్పటికే సన్నాహాలు ప్రారంభించిందని మంత్రి దుర్గేష్ తెలిపారు. ప్రతి కేబినెట్ సమావేశంలోనూ ఈ అంశాన్ని ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ, శాశ్వత నివారణ చర్యలపై ముమ్మరంగా కృషి చేస్తున్నామని వెల్లడించారు.అధికారులు అందించిన వివరాల ప్రకారం.. తిమ్మరాజుపాలెంలో 20 హెక్టార్లు, కోరుమామిడిలో 34, కంసాలిపాలెంలో 100, రావిమెట్లలో 76, సింగవరంలో 36, తాళ్లపాలెంలో 32, నిడదవోలులో 72 హెక్టార్లు చొప్పున మొత్తం 370 హెక్టార్లలో సుమారు 530 మంది రైతులు నష్టపోయినట్లు అధికారులు మంత్రి దుర్గేష్ కి వివరించారు. భారీ వర్షాలు పడుతున్నందున ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి దుర్గేష్ వారికి దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా రోడ్లపై పేరుకుపోయిన చెత్తను తొలగించి వాహనదారుల ప్రయాణానికి మార్గం సుగమం చేశారు.

# జ్ఞానేశ్ రాజీనామా చేయాల్సిందే

**ఢిల్లీ, సెప్టెంబర్ 25:** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)పై ఇద్దరు ఎన్నికల కమిషనర్ల అభ్యంతరాల నేపథ్యంలో సీఈసీ జ్ఞానేశ్ కుమార్కు వ్యతిరేకంగా ప్రతిపక్ష కాంగ్రెస్ దేశవ్యాప్తంగా పలుచోట్ల నిరసనలు చేపట్టింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఆ పార్టీ నేతలు నినాదాలు చేశారు. ఈ క్రమంలో ఢిల్లీలో నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. పలువురు కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు బారికేడ్లను తొలగించుకొని ఎన్నికల కమిషన్ కార్యాలయం వైపు దూసుకెళ్లారు. పోలీసులు వారిని అడ్డుకొని నిర్బంధించారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య తోపులాట చోటుచేసుకుంది. ప్రజాస్వామ్యం నాశనమవుతుంటే చూస్తూ కూర్చోబోమని ఢిల్లీ కాంగ్రెస్ అధ్యక్షుడు దేవేందర్ యాదవ్ అన్నారు. అంతకుముందు సీఈసీ జ్ఞానేశ్ కుమార్ మాస్కును ధరించి.. యూత్ కాంగ్రెస్ నేతలు ఢిల్లీలో ఆందోళన చేపట్టారు. ఆందోళనల నేపథ్యంలో అస్సాం కాంగ్రెస్ అధ్యక్షుడు గౌరవ్ గొగోయ్ ని పోలీసులు నిర్బంధించారు. బిహార్ రాజధాని పట్నా, చండీగఢ్ లో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. నిరసనకారులను అదుపు చేసేందుకు పోలీసులు జలఫిరంగులు ప్రయోగించారు. ఇదే తరహా ఆందోళనలు కోల్ కతా, జమ్మూ తదితర ప్రాంతాల్లోనూ జరిగాయి.

# క్రిమినల్ ప్రాసిక్యూట్ చేయాలె

(మొదటి పేజీ తరువాయి)

న్యాయవాది శైలేంద్ర మణి త్రిపాఠి పిటిషన్ వేశారు. ఇద్దరు ఎన్నికల కమిషనర్ల ఆమోదం లేకుండా.. జ్ఞానేశ్ కుమార్ తీసుకున్న నిర్ణయాలు, జారీ చేసిన మార్గదర్శకాలు, చేపట్టిన సాఫ్ట్ వేర్ మార్పులన్నీ రాజ్యాంగ విరుద్ధమైనవిగా ప్రకటించాలని పిటిషనర్ సుప్రీంకోర్టును కోరారు. సర్ కు సంబంధించిన నిర్ణయాలు చట్టవిరుద్ధమని ప్రకటిస్తూ.. ‘ఫామ్-6’ను పునరుద్ధరించాలని అభ్యర్థించారు. సర్ ప్రక్రియ సమయంలో దేశవ్యాప్తంగా 13 కోట్ల మంది పేర్లను ఎన్నికల జాబితా నుంచి తొలగించారన్న ఆరోపణలున్నాయని, వాటిపై సిట్ తో దర్యాప్తు జరిపేలా ఆదేశాలివ్వాలని పిటిషనర్ కోరారు.

# సీఈసీ రాజీనామాకు ఇంక మిగిలింది 24 గంటలే

(మొదటి పేజీ తరువాయి)

పోటీ చేయడం మానుకోవాలని పిలుపునిచ్చారు. ఎన్నికల్లో రిగ్గింగ్ జరుగుతుందనేది ముమ్మాటికీ నిజమేనని ఆరోపించారు. అయితే, ప్రతిపక్షాలు ఎన్నికల్లో పాల్గొనడంతో.. అవి స్వేచ్ఛగా, పారదర్శకంగా జరుగుతున్నాయనే భావన ప్రజల్లో కలుగుతోందన్నారు. ఎన్నికల్లో అవకతవకలు జరుగుతున్నాయని పదేపదే ఆరోపిస్తున్నప్పటికీ.. ప్రతిపక్ష పార్టీలు ఎందుకు పోటీ చేస్తున్నాయని ప్రశ్నించారు. ‘మీరు ఎన్నికల్లో పోటీ చేయకపోతే మీ ఉనికికే ముప్పు వాటిల్లుతుందనే భయంతో పోటీ చేస్తుండొచ్చు. కానీ ఓట్లు దొంగిలిస్తున్నప్పుడు.. మీ ఎమ్మెల్యేలు, ఎంపీలను ప్రలోభపెడుతున్నప్పుడు.. మీ పార్టీలు చీలిపోతున్నప్పుడు.. మీరు ఇంకా ఎలాంటి ఉనికిని కాపాడుకోవడానికి ప్రయత్నిస్తున్నారు? ఆట మోసపూరితమైందని చెబుతున్నప్పుడు.. దానికి కొనసాగించడం తప్పు.

# శ్రీమఠంలో ఘనంగా అనంత చతుర్దశి వేడుకలు

## శ్రీ మూలరాములకు ప్రత్యేక పూజలు..



మంత్రాలయం, సెప్టెంబర్ 25(మనం న్యూస్): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి మఠంలో మఠం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థుల నేతృత్వంలో శుక్రవారం అనంత చతుర్దశి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంత చతుర్దశిని పురస్కరించుకుని అనంత పద్మనాభ స్వామి ప్రతిమకు మూల రామదేవతలకు పీఠాధి పతి సుభుదేంద్ర తీర్థులు ప్రత్యేక పూజలు చేసి, దీప దూప నైవేద్యాలను సమర్పించి మంగళహారతి ఇచ్చారు అంతకుముందు శ్రీ రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి పూజలు నిర్వహించి ప్రత్యేక పూలతో అలంకరించారు. భక్తులుశ్రీ రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్న అనంతరం శ్రీమఠం పీఠాధిపతి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో శ్రీ మఠం ఏ ఏ ఓ మాధవ శెట్టి శ్రీ మఠంమేనేజర్ శ్రీనివాసరావు, సహయ మేనేజర్ ఐపి నరసింహస్వామి, అనంతపురానిక్ స్వామి, వ్యాసరాచార్, భక్తులు పాల్గొన్నారు.

# స్వచ్ఛతా హీ సేవా పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించిన

## డిప్యూటీ ఎంపీడీవో ఈ బి, మల్లికార్జున



బేతంచేర్ల సెప్టెంబర్ 25(మనం న్యూస్): స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం మండల పరిధిలో ఆర్.ఎస్. రంగాపురం లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో బి.మల్లికార్జున ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ ఈ ఇంటి పరిసరాలతో పాటు గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడం తడి-పొడి చెత్తను వేరు చేసి సక్రమంగా నిర్వహించడం చెత్తను బహిరంగ ప్రదేశాల్లో వేయకుండా జాగ్రత్తలు తీసుకోవడం వంటి అంశాలను వివరించారు ప్రతి ఇంటిలో బిన్-బ్యాగ్ విధానాన్ని తప్పనిసరిగా ఏర్పాటు చేసుకుని దాని వినియోగాన్ని ఆచరణలోకి తీసుకురావాలని సూచించారు ఇంటి వద్ద ఉత్పత్తయ్యే చెత్తను సక్రమంగా వేరు చేసి పారిశుధ్య సిబ్బందికి అందించడం ద్వారా గ్రామాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు ప్రతి కుటుంబం సహకరించాలని కోరారు పరిశుభ్రత అనేది ఒక్కరోజు కార్యక్రమంగా కాకుండా నిరంతర ప్రక్రియగా కొనసాగాలని ప్రజల భాగస్వామ్యంతోనే స్వచ్ఛమైన ఆరోగ్యకరమైన గ్రామాన్ని నిర్మించగలమని అధికారులు పేర్కొన్నారు కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్మమ్మ కళాశాల అభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తా

- ఎంపీ బస్తిపాటి నాగరాజు హామీ




ఎమ్మిగనూరు/ సెప్టెంబర్ 25(మనం న్యూస్): ఎమ్మిగనూరు శ్రీ మహాయోగి లక్ష్మమ్మ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తానని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు హామీ ఇచ్చారు. కళాశాలలో శుక్రవారం కళాశాల అధ్యక్షులు డాక్టర్ మహబూబ్ బాషా అధ్యక్షతన 'యువత భవితకు భరోసా' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, మంత్రాలయం టీడీపీ ఇన్చార్జి రాఘవేంద్ర రెడ్డి, పెద్దకడుబూరు రమాకాంత్ రెడ్డి తదితరులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. కళాశాలలో విద్యనభ్యసించిన అనేక మంది విద్యార్థులు ఉన్నత పదవులు చేపట్టారని, ప్రస్తుతం కూడా కళాశాలలో అందిస్తున్న విద్య, నైపుణ్యాలను సద్వినియోగం చేసుకుని పలువురు విద్యార్థులు ఉద్యోగాలు సాధిస్తున్నారని తెలిపారు. కళాశాల అభివృద్ధికి 10 తరగతి గదులు, 100 కంప్యూటర్లు, ప్రధాన రహదారి నుంచి అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్ వరకు సీసీ రోడ్డు, కాన్ఫరెన్స్ హాల్తో పాటు ఎన్సీసీ విభాగం అవసరమని ఎంపీ బస్తిపాటి నాగరాజును కోరారు.పెద్దకడుబూరు రమాకాంత్ రెడ్డి మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి అవసరమైన ప్రణాళిక రూపొందించి, కళాశాలకు చెందిన మిగి లిన స్థలాన్ని కూడా పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు. మంత్రాలయం టీడీపీ ఇన్చార్జి రాఘవేంద్ర రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమని అన్నారు. ప్రజలకు, విద్యార్థులకు ఇచ్చిన హామీలను దశలవారీగా నెరవేర్చి తీరుతామని స్పష్టం చేశారు. ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ విద్యార్థులే భవిష్యత్తు అనే ఉద్దేశంతో మంత్రి నారా లోకేష్ విద్యారంగంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని తెలిపారు. శ్రీ మహాయోగి లక్ష్మమ్మ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు తాను తొలిసారిగా రావడం జరిగిందని, కళాశాలలో విద్యార్థుల ప్రతిభ, క్రమశిక్షణ తనను ఆకట్టుకున్నాయని చెప్పారు. జిల్లాలో ప్రత్యేక గుర్తింపు పొందిన నాక్ 'ఏ' గ్రేడ్ కళాశాలగా ఉన్నందుకు అభినందనలు తెలిపారు.

# అనుమతులు లేని నవోదయ కోచింగ్ సెంటర్లను సీజ్ చేయాలి



ఎమ్మిగనూరు, సెప్టెంబర్ 25(మనం న్యూస్): అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న నవోదయ కోచింగ్ సెంటర్లను తక్షణమే సీజ్ చేయాలని ఐక్య విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. అనుమతులు లేని కోచింగ్ సెంటర్లపై ఏసీబీతో సమగ్ర తనిఖీలు నిర్వహించాలని కోరుతూ ఎస్ ఎఫ్ ఐ , ఏ ఐ వై ఎఫ్ , యూ ఎస్ ఎఫ్ ఐ,ఆర్ పి ఎస్ ఎఫ్,బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో ఎమ్మిగనూరులోని విక్టరీ నవోదయ కోచింగ్ సెంటర్ ఎదుట ధర్నా నిర్వహించారు.

ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు విడుదల చేసిన ప్రకటన లో మాట్లాడుతూ నవోదయ విద్యాలయాల్లో సీట్ల కోసం ఏర్పాటు చేస్తున్న కొన్ని కోచింగ్ సెంటర్లు విద్యార్థులపై తీవ్ర ఒత్తిడి పెడుతున్నాయని ఆరోపించారు. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు విద్యార్థులను తరగతులకు పరిమితం చేయడం వల్ల వారు మానసికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.

కోచింగ్ ఒత్తిడిని తట్టుకోలేక తల్లిదండ్రులకు దూరంగా హాస్టల్లో ఉంటున్న విద్యార్థి నిశాంత్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన అనంతరం అధికారులు కొంతకాలం చర్యలు తీసుకున్నారని, అయితే రెండు రోజులకే పరిస్థితి మళ్లీ యథావిధిగా మారిందని వారు ఆరోపించారు. బాలల హక్కుల పరిరక్షణకు సంబంధించి గతంలో బాలల హక్కుల కమిషన్ ఇచ్చిన ఆదేశాలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు.

# మంత్రి టీజీ భరత్ చొరవతో నలుగురికి రూ.9.34 లక్షల సీఎంఆర్ఎఫ్ ఆర్థిక సహాయం



కర్నూలు సెప్టెంబర్ 25(మనం న్యూస్): కర్నూలు: ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా కర్నూలు నగరానికి చెందిన నలుగురు లబ్ధిదారులకు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ చొరవతో ఆర్థిక సహాయం మంజూరైంది. ఇందుకు సంబంధించిన CMRF చెక్కులను మంత్రి టీజీ భరత్ ఆయన కార్యాలయంలో లబ్ధిదారులకు అందించారు. కర్నూలు నగరంలోని అశోక్ నగర్కు చెందిన మాధవికి రూ.4,00,400 చెక్కును అందించారు. అలాగే పఠాన్ నవాజ్ ఖాన్కు రూ.2,84,734, నూరున్నిసాకు రూ.95,790, షేక్ నజ్నీన్ (చైల్డ్), ఇ/ా ఎన్. మాలిక్ బాషాకు రూ.1,53,930 ఆర్థిక సహాయం మంజూరైంది. నలుగురు లబ్ధిదారులకు కలిపి మొత్తం రూ.9,34,854 ఆర్థిక సహాయం అందింది. ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయం ఎంతో ఉపయో గకరంగా ఉంటుందని మంత్రి టీజీ భరత్ తెలిపారు. ప్రజలకు అవసరమైన సమయంలో ప్రభుత్వం అండగా నిలుస్తూ, సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని పేర్కొన్నారు.

# స్వామివారి సేవలో మరో అడుగు..

## కోటిపల్లి రమణకు సీనియర్ అసిస్టెంట్గా పదోన్నతి



అన్నవరం, సెప్టెంబర్ 25(మనం న్యూస్): శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి దివ్య సన్నిధిలో సేవలందిస్తున్న జూనియర్ అసిస్టెంట్ కోటిపల్లి రమణకు సీనియర్ అసిస్టెంట్గా పదోన్నతి లభించింది. ఈ మేరకు జారీ అయిన పదోన్నతి ఉత్తర్వుల ప్రతిని దేవస్థానం కార్యనిర్వహణాధికారి నల్లం సూర్యచక్రధరరావు రమణకు అందజేశారు. శ్రీ సత్యదేవుని సన్నిధిలో భక్తుల సేవే పరమ భాగ్యంగా భావిస్తూ, విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తున్న రమణకు పదోన్నతి లభించడం పట్ల దేవస్థానం ఉద్యోగులు, సహచర సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. భక్తులకు మెరుగైన సేవలు అందించడంలో, దేవస్థానం పరిపాలనా కార్యక్రమాల్లో తన వంతు బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ రమణ తన సేవా ముద్రను చాటుకున్నారని సహచరులు పేర్కొన్నారు.

అన్నవరం దేవస్థానంతో పాటు వివిధ దేవస్థానాల్లో దశాబ్ద కాలానికి పైగా సేవలు అందించిన అనుభవం రమణకు ఉంది. దేవస్థాన సేవను కేవలం ఉద్యోగ బాధ్యతగా కాకుండా సత్యదేవుని సేవగా భావిస్తూ నిబద్ధతతో విధులు నిర్వహించడం ఆయన ప్రత్యేకతగా సహచరులు కొనియాడారు. స్వామివారి అనుగ్రహంతో లభించిన ఈ పదోన్నతి ద్వారా రమణ భవిష్యత్తులో మరింత బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తూ భక్తులకు, దేవస్థానానికి మరింత సేవ చేయాలని పలువురు ఆకాంక్షించారు. పదోన్నతి పొందిన రమణను ఈఓ నల్లం సూర్యచక్రధరరావుతో పాటు దేవస్థానం అధికారులు, ఉద్యోగులు అభినందించారు. సత్యదేవుని సేవలో లభించిన ప్రతి బాధ్యత ఒక వరప్రసాదమే అన్న భావనతో రమణ తన తదుపరి బాధ్యతల్లోనూ అంకితభావంతో ముందుకు సాగాలని సహచరులు ఆకాంక్షించారు.

# ప్రశాంతం.. పరిపూర్ణం సాఫీగా జరిగిన నిమజ్జనోత్సవాలు

- రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 4 లక్షల విగ్రహాల ఏర్పాటు
- రాజధానిలో మంత్రి పొన్నం ఏరియల్ సర్వేనవరాత్రుల సందర్భంగా 13 మంది మృతి.. 26 మందికి గాయాలు



హైదరాబాద్, సెప్టెంబర్ 25 : తెలంగాణ వ్యాప్తంగా గణేశ్ నిమజ్జనోత్సవాలు ప్రశాంతంగా జరిగాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా ముగిశాయి. పోలీసు శాఖ తీసుకున్న పకడ్బందీ భద్రతా చర్యలు, కట్టుదిట్టమైన ట్రాఫిక్ నియంత్రణల కారణంగా నిమజ్జన ప్రక్రియ సజావుగా సాగింది.

హైదరాబాద్ నగరంతో పాటు ఆదిలాబాద్, నిర్మల్, నారాయణపేట సహా అన్ని జిల్లాల్లో లక్షలాది విగ్రహాలు గంగమ్మ ఒడికి చేరాయి. శుక్రవారం జరిగిన నిమజ్జన బందోబస్తు ఏర్పాట్లపై రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్ లక్డీకాపూల్లోని డీజీపీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించి పూర్తి వివరాలు వెల్లడించారు.

**నాలుగు లక్షల వరకు విగ్రహాలు**

రాష్ట్రవ్యాప్తంగా ఈ ఏడాది సుమారు 1,24,000 పైచిలుకు విగ్రహాలను ప్రతిష్ఠించినట్లు డీజీపీ తెలిపారు. గతేడాదితో పోలిస్తే ఈ సంఖ్య 8,000 ఎక్కువ అని పేర్కొన్నారు. ఇక అపార్ట్మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలు, వ్యక్తిగత గృహాల్లో ప్రతిష్ఠించిన చిన్న విగ్రహాలను కూడా కలుపుకుంటే ఈ సంఖ్య సులభంగా మూడున్నర లక్షల నుంచి నాలుగు లక్షల వరకు ఉంటుందని అంచనా వేశారు. పోలీసు శాఖ ప్రత్యేకంగా రూపొందించిన ఇన్స్టాలేషన్ అండ్ ఇమర్షన్ పోర్టల్ ద్వారా మండపాల నిర్వాహకులు, పోలీస్ అధికారులు సమన్వయం చేసుకుని విగ్రహాల వివరాలను పక్కాగా నమోదు చేసినట్లు డీజీపీ వివరించారు. శుక్రవారం సాయంత్రం 7 గంటల సమయానికే రాష్ట్రవ్యాప్తంగా 63,350 విగ్రహాల నిమజ్జనం పూర్తి కాగా, మరో 32 వేల విగ్రహాలు నిమజ్జనానికి క్యూలో ఉన్నాయని, శనివారం ఉదయం నాటికి ప్రక్రియ మొత్తం పూర్తవుతుందని ఆయన స్పష్టం చేశారు.

# ప్రకృతి వ్యవసాయంతో ఆదాయలు అధికం



మంత్రాలయం సెప్టెంబర్ 25 ( మనం న్యూస్);- ప్రకృతి వ్యవసాయంతో తక్కువ పెట్టుబడి అధిక ఆదాయాలు పొందవచ్చని డిస్టిక్ అగ్రికల్చర్ ఆఫీసర్ వరలక్ష్మి పేర్కొన్నారు. మంత్రాలయం మండలంలోని చెట్నాహళ్లి గ్రామంలో లక్ష్మి ప్రకృతి వ్యవసాయంతో పండించిన పొలంలోని పంటను పరిశీలించారు.0.70 ఎకరంలో మినుములు అలసంద కంది గోరుచిక్కుడు పెసర మినుములు బీర దోసకాయ పలు రకాల పంటలు సాగు చేయడం జరిగింది. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ఈ పంటలు పండించడం వల్ల భూమిలో తేమను ఎరువులను వినియోగించు కొని దిగుబడి సాధించవచ్చు అన్నారు. ఒకే పంట కలంలో అన్ని రకాల పండించవచ్చన్నారు. వర్షపాతం తక్కువ ఉన్న క్రిమిసంహారక మందులు వాడకుండా పంటలు పండించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏడిఏ మహమ్మద్ ఖాద్రి మండలం వ్యవసాయ అధికారి జీరా గణేష్ ఏఈవోలు ప్రతాప్ గౌడు తిరుమల్ రెడ్డి ఎంపిఈఓ బసవరాజు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

# గుబ్బలవారి కాలువగట్టు రోడ్డును నిర్మించండి మహాప్రభో



కాట్రేనికోన సెప్టెంబర్ 25(మనం ప్రతినిధి); కాట్రేనికోన పంచాయతీ శివారు మొండిపోరలో గుబ్బల వారి కాలువగట్టు రోడ్డు ఎక్కడికక్కడ గుంతలు పడి పాడవడంతో రాకపోకలకు నిత్యం ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. మొండిపోరలో కాలువ గట్టు వెంబడి సుమారు 50 కుటుంబాలు పైనే జీవనం సాగిస్తున్నామన్నారు .ఈ గ్రామంలో రోడ్డు నిర్మించి సుమారు 20 ఏళ్ల కాలం దాటింది అన్నారు. అప్పటినుంచి ఎన్నికవుతున్న ప్రతి ప్రజాప్రతినిధిని, అధికారులను రోడ్డు నిర్మించాలని అడుగుతూనే ఉన్నామన్నారు .ప్రభుత్వాలు మారుతున్న తమ గ్రామానికి రోడ్డును మాత్రం నిర్మించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డంతా గుంతల పడటంతో కురుస్తున్న వర్షాలకు నీరు చేరి బురదగా మారి పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, నిత్యం రాకపోకలను సాగించే స్థానికులతో పాటు సత్తమ్మ చెట్టు రేపు వారి పేట, మొండిపోర తదితర గ్రామ ప్రజల సైతం ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత ప్రభుత్వంలోనూ కనీసం పట్టించుకోలేదని వారు తెలిపారు. వైద్య అత్యవసర వేళల్లో అంబులెన్స్ వచ్చేందుకు ఇబ్బంది పడాల్సిందే అన్నారు . వర్షాకాలం అన్ని రోజులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి తమ గ్రామానికి రోడ్డుని నిర్మించాలని గ్రామస్తులు వేడుకొంటున్నారు.

# యర్రవరం శిశుమందిర్లో ఘనంగా 'నమామి భారతం-వందేమాతరం'



ఏలేశ్వరం,సెప్టెంబర్, 25(మనం న్యూస్): ఏలేశ్వరం మండలం యర్రవరంలోని శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో 'నమామి భారతం-వందేమాతరం' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వందేమాతరం గీతం 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శ్రీ సరస్వతి శిశుమందిర్, శ్రీ సూర్య విద్యా సంస్థల విద్యార్థుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ఆర్ఎస్ఎస్, బీజేపీ కార్యకర్తలు, అధికారులు, నాయకులు, గ్రామ ప్రజలు కలిపి సుమారు 300 మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా అందరూ కలిసి వందేమాతరం పూర్తి గీతాన్ని సామూహికంగా ఆలపించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు వందేమాతరం గీత చరిత్ర, విశిష్టతను వివరించారు. దేశభక్తి, జాతీయ భావాలను పెంపొందించడంలో వందేమాతరం గీతానికి ఉన్న ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ గోపి ఆనంద్ స్వరూప, ప్రధాన ఆచార్యులు తోట వీర రాఘవరావు, చదరం నరసింహారావు, చాగంటి నరసింహారావు, కన్నబాబు మాస్టారు, శ్రీ సూర్య ప్రధానోపాధ్యాయులు లక్ష్మీపతిరావు, ఆకుల హరిబాబు, బీజేపీ నేతలు నీలి వీరస్వామి, కూరాకుల రాజా, గట్టెం వెంకటరమణ, అలమండ మధు, బండారు సూరిబాబు, బీసెట్టి పరదేశి, కేలంగి వీరబాబు, తోట వీర మహేశ్వరరావు, తోట గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము, దేవదాయ ధర్మదాయ శాఖ
**శ్రీ సత్యమ్మ అమ్మవారి దేవస్థానము**
అంబారుపేట గ్రామము, నందిగామ మండలం, ఎన్.టి.ఆర్.జిల్లా

**టెండర్ - కమ్ - బహిరంగ వేలం పాట ప్రకటన**

ఎన్.టి.ఆర్.జిల్లా నందిగామ మండలము అంబారుపేట గ్రామంలో వేంచేసివున్న శ్రీ సత్యమ్మ అమ్మవారి దేవస్థానమునకు భక్తులచే సమర్పించబడిన చీరలు, జాకెట్ మరియు కొబ్బరి కాయలు, విక్రయించుకొను హక్కు పాట మరియు కొబ్బరి చిప్పలు ప్రోగు చేసుకొను బహిరంగ వేలం పాట ది.30.09.2026 అనగా బుధవారం ఉదయం / మధ్యాహ్నం 11.00 గంటలకు శ్రీ సత్యమ్మ అమ్మవారి దేవస్థానము ఆఫీస్ వద్ద డిపార్ట్మెంట్ అధికారుల సమక్షములో టెండర్ కమ్ బహిరంగ వేలం ద్వారా పాట పెట్టబడును. పాటలో పాల్గొనదలచిన వారు ఈ క్రింది ఉదాహరించిన విధముగా డిపాజిట్లను పాటకు ముందుగా చెల్లించి, సదరు పాటలో పాల్గొనవలయును.

| క్ర.సం | వివరములు | కాలపరిమితి | ప్రథమ ధరావత్తు |
|---|---|---|---|
| 1 | కొబ్బరి కాయలు విక్రయించుకొను టెండర్ కమ్ బహిరంగ వేలము పాట | ది.22-11-2026 నుండి ది.21-11-2027 వరకు | రూ.2,00,000/- |
| 2 | కొబ్బరి చిప్పలు ప్రోగు చేసుకొను టెండర్ కమ్ బహిరంగ వేలము పాట | ది. 22-11-2026 నుండి ది. 21-11-2027 వరకు | రూ.50,000/- |
| 3 | అమ్మవారి చీరలు మరియు జాకెట్ ముక్కలు టెండర్ కమ్ బహిరంగ వేలము పాట | ది. 22-11-2026 నుండి ది. 21-11-2027 వరకు | రూ.1,00,000/- |
| 4 | దసర ఉత్సవములు 10 రోజులకు దేవస్థానమునకు అవసరమైన స్పెషల్ లైటింగ్, లైటింగ్ గడ్డలు పాతటం, తొలగించడం, జనరేటర్ ఏర్పాటు, డీజిల్ సరఫరా, లైటింగ్ వర్కర్స్కు భోజనాలు వగైరా - సీల్డు టెండర్ కొటేషన్ / టెండర్ అందజేయడం. | | |

మిగతా వివరాలు కొరకు దేవస్థానం పని చేయువేళలలో సంప్రదించగలరు.
తేది : 24-09-2026 అంబారుపేట గ్రామము
మంచాల మాధరావు, ఆలయ కమిటీ చైర్మన్ మరియు కమిటీ సభ్యులు
సం/- కార్యనిర్వహణాధికారి

# పర్యావరణంపై అవగాహన అవసరం



వాతవరణంలో సంభవించే మార్పులు, పారిశుధ్ధ్యలోపం, నగరీకరణ, పారిశ్రామీకరణ వలన మానవాళికి ఏర్పడిన ప్రమాదం పట్ల అవగాహన పెంపొందించడం, పర్యావరణ నాణ్యతను పెంచడం వంటి అంశాల ఆధారంగా ప్రపంచ పర్యావరణ ఆరోగ్య దినోత్సవం ఏర్ప డింది. మనం పీల్చే గాలి సురక్షితంగా ఉండాలి. తాగే నీరు పరిశుభ్రంగా ఉండాలి. తినే ఆహారం కల్తీ కాకుండా చూడాలి. ప్రపంచాన్ని రక్షించ డానికి, భావితరాలకు మంచి భవిష్యత్తును అందించడానికి పర్యావరణాన్ని పరిరక్షించాలి. పారిశుద్ధ్య సదుపాయాలు మెరుగు పరచాలి. వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. విజ్ఞానంతో కూడిన సమాజాన్ని నెలకొల్పాలి. ప్రకృతిలో సహజంగా సంభవించిన ఏర్పాటును విధ్వంసం చేయడం వలన మానవాళి మనుగడ ప్రమాదంలో పడింది. ఆరోగ్యానికి,పర్యావరణానికి మధ్య గల అవినాభావ సంబంధాన్ని గుర్తెరిగి ప్రవర్తించాలి. పర్యావరణం మానవ దుష్కృత్యాల వలన అనేక పరిణామాలకు గురైనది. పర్యావరణంలో నాశనమైతే,అది అంతిమంగా మానవ ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది. పర్యావరణం ఆరోగ్యంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారు. ఇదే భావనతో ప్రపంచ పర్యావరణ ఆరోగ్య దినోత్సవం జరుగుతున్నది. ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనాల ప్రకారం ప్రపంచంలో 24 శాతం మంది ప్రజలు పర్యావరణ సమస్యల వలన ఇబ్బందులకు గురౌతున్నారు. సుమారు 12.6 శాతం మంది ప్రజలు పర్యావరణ సంబంధిత అనారోగ్య సమస్యల వలన మృత్యువాత పడుతున్నారు.గాలి, నీరు, నేల, ఆహారం ఇలా అన్నింటి లోను హానికరమైన రసాయనిక పదార్థాలు,ఇతర భౌతిక,జీవ సంబంధిత హాని కారకాలు చేరడం వలన అనేక అనర్థాలు సంభవిస్తున్నాయి.ప్రజల ఆరోగ్యం పర్యావరణం పై ఆధారపడి ఉంది. పర్యావరణం బాగుండాలంటే ప్రజలకు స్వచ్ఛ మైన గాలి, నీరు ఆహారం కావాలి. వాయు కాలుష్యం వలన, నీటి కాలుష్యం వలన వాతా వరణంలో అనేక అవాంఛనీయ పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి.పర్యావరణం దెబ్బ తినడం వలన ప్రజలు అనారోగ్యవంతులవు తున్నారు. ప్రజలు ఆరోగ్యవంతంగా ఉంటేనే ఆర్థిక ప్రగతి సాధ్యపడుతుంది. పర్యావరణం ఆరోగ్య వంతంగా ఉంటేనే మానవ మనుగడ సాధ్యపడుతుంది. పర్యావరణాన్ని వివిధ రకాల కాలుష్యాల నుండి కాపాడి,ప్రజల ఆరోగ్యం మెరుగుపరచడానికి 1986 సంవత్సరంలో లండన్ ప్రధాన కార్యాలయం గా 'ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఎన్విరాన్మెంటల్ హెల్త్ కౌన్సిల్' (IFEH) ఏర్పడింది. ఇండోనేషియాలోని బాలి ప్రావిన్స్ రాజధాని డెన్‌పసర్‌లో 2011 సంవత్స రంలో జరిగిన ఈ కౌన్సిల్ సమావేశం ప్రతీ సంవ త్సరం సెప్టెంబర్ 26వ తేదీన ప్రపంచ పర్యా వరణ ఆరోగ్య దినోత్సవం జరపాలని నిర్ణయిం చింది. పర్యావరణానికి ఇబ్బందికరంగా మారిన గ్రీన్ హౌస్ వాయువుల గురించి, వాతావరణ మార్పుల గురించి ప్రజల్లో అవగాహన కలిగిం చడం, కాలుష్య కారకాలను తగ్గించడానికి చర్యలు తీసుకోవడం, మొక్కలను పెంచడం వంటివి అంతర్జాతీయ పర్యావరణ ఆరోగ్య మండలి ప్రణాళికలో చోటు చేసుకున్న ప్రధానాంశాలు. పుడమిపై పచ్చదనం మాయమైపోతున్నది.

పచ్చని పంట పొలాలతో, పసందైన ప్రకృతి ఒడిలో స్వచ్ఛమైన ప్రాణవాయువును పీలుస్తూ, అంటువ్యాధులను సైతం అవలీలగా జయించి, రసాయనిక పదార్థాలు లేని,సహజసిద్దమైన బలవర్ధకమైన ఆహారాన్ని భుజించి, ఆరోగ్యవంతంగా నిండు నూరేళ్ళు జీవించిన నాటితరం నాటి జీవన విధానం నేటి తరంలో అగుపించడం లేదు. కృత్రిమ వాతావరణంలో, కాలుష్య కారకాల మధ్య నిరంతరం అష్టకష్టాలు పడుతూ, ఆరోగ్యాలు చెడి, అంటువ్యాధుల బారిన పడి అలమటిస్తున్న వారి ఆవేదనలు, ఆక్రందనలు అత్యంత బాధాకరంగా ఉన్నాయి.

నిరక్షరాస్యత ప్రబలంగా ఉన్న నాటి కాలంలో కూడా ప్రజలు ఎంతో విజ్ఞత ప్రదర్శించి, ప్రకృతిని దైవంగా ఆరాధించే వారు. విజ్ఞానం పెరిగిన కొద్దీ నేటి ప్రపంచం అజ్ఞానంతో అలమటిస్తూ, మితిమీరిన స్వార్థంతో ప్రకృతి పై విధ్వంస కాండను కొనసాగిస్తున్నది. పెరిగిన జనాభా ఇతర జీవరాశుల అంతానికి నాంది పలికింది.పెరిగిన జనాభాకు సరిపడా ఆహారం సమకూర్చడం కోసం ఆహర ధాన్యాల ఉత్పత్తిని పెంచవలసిన అవసరం ఏర్పడింది. ఆహారోత్ప త్తుల పెంపుదలకు పంటల్లో విరివిగా రసాయనిక ఎరువుల వాడకం పెరిగింది. క్రిమికీటకాదుల నుండి పంటలను సంరక్షించడానికి మోతాదుకు మించి, క్రిమి సంహారక మందులను వినియోగిం చడం వలన పంటలకు సహజ మిత్రులైన పలు జీవరాశులు నశించిపోయాయి.

వాతావరణంలో కాలుష్యం పెరిగింది. ఊహించని వాతావరణ మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ప్రజల నివాసాలకోసం పచ్చని పొలాలు, అడవులు విధ్వంసమైనాయి. అవసరాలకు మించి ఆకాశహర్మ్యాలు పెరిగిపోయాయి. పట్టణాల సంస్కృతిని పల్లెలు సంతరించుకున్నాయి. నగరీకరణ వలన సహజసిద్ధమైన వాతావరణం అంతరించింది. కలుషితాల వలన అంటువ్యాధులు ప్రబలిపోతున్నాయి. ప్రకృతిలో పలు అవాంఛనీయ పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. సముద్ర జలాలు వేడెక్కి, ఎల్ నినో సమస్య ఏర్పడి భూమండలం అగ్ని గుండంలా మారింది.

కరువు పరిస్థితులు తాండవిస్తున్నాయి. ఒక వైపు కరువు, మరో వైపు వరదలు వంటి విచిత్రమైన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ప్రకృతి విలయాలతో జనజీవనం అస్తవ్యస్తమౌతున్న నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణకు సంబంధించి తక్షణ చర్యలు తీసుకోవలసిన అవసరం ఏర్ప డింది. పర్యావరణ పరిస్థితులపై దృష్టి సారించకపోతే ఇప్పటికే ప్రమాదపు అంచున ఉన్న మానవాళి తన మనుగడను కోల్పోయే ప్రమాదం ఉంది. పచ్చదనాన్ని పెంచి, పర్యావరణాన్ని పరిరక్షించడంలోనే సకల మానవాళి క్షేమంగా మనుగడ సాగించగలదు. పచ్చదనం యొక్క ప్రాధాన్యత చాటి చెప్పాలి.

ఒక వైపు మొక్కల పెంపకం ఆవ శ్యకత గురించి చెబుతూనే, మరొక వైపు చెట్లను నరకడం పరిహాసప్రాయమౌతున్నది. ఐక్యరాజ్య సమితితో పాటు పలుఅంతర్జాతీయ సంస్థలు పర్యావరణ పరిరక్షణ కోసం పాటుపడుతున్నా యి. ప్రజల్లో చైతన్యం కోసం పలు కార్యక్రమా లను రూపొందిస్తున్నాయి.

ప్రపంచ దేశాలన్నీ పర్యావరణం గురించి, పచ్చదనం యొక్క ఆవశ్య కత గురించి పదే పదే చెబుతూనే ఉన్నా,అవన్నీ కేవలం మాటల వరకే పరిమితమౌతున్నాయి. సందర్భానుసారంగా మొక్కుబడిగా మొక్కలను నాటి, వాటి సంరక్షణను గాలికొదిలేయడం వలన మొక్కలు నాటే కార్యక్రమాలు నగుబాటు పాలౌ తున్నాయి. పర్యావరణ సంరక్షణ సమిష్టి బాధ్యత. ప్రపంచంలో తలెత్తే పలు సమస్యలకు పర్యావరణ విధ్వంసమే మూలకారణం.కాలుష్యకారకాలు విజృంభించడం భూఉష్ణోగ్రతలు భరింపశక్యం కాకుండా పెరగడం ఊహాతీతమైన ప్రకృతి విలయాలకు సంకేతం. ఆధునిక పరిజ్ఞానం ప్రజల ఆరోగ్యాలపై పెను ప్రభావం చూపుతున్నది. ఆధునిక నాగరికత జనావాసాలను కాంక్రీటు అరణ్యాలుగా మారుస్తున్నది.

చెరువులు,ఇతర నీటి వనరులు నశించిపోతున్నాయి. సముద్ర జలాలు కలుషితమై సముద్ర జీవాలు అంతరించి పోతు న్నాయి. ప్రకృతిలో చోటు చేసుకుంటున్న పరిణా మాలు జీవవైవిధ్యానికి ముప్పుగా మారాయి. మానవ స్వార్థం ఇతర జీవరాశులకు భూగ్రహంపై చోటులేకుండా చేస్తున్నది. విలాసవంతమైన జీవన విధానం జీవ వైవిధ్యానికి తూట్లు పొడుస్తున్నది. దూరదృష్టి నశించి చెట్లను నరకడం పెరిగిన మానవ పైత్య ప్రకోపానికి నిదర్శనం. ఇకనైనా పర్యావరణానికి సంభవిస్తున్న పెను ముప్పును నివారించాలి. ప్రమాదకరంగా మారిన ప్లాస్టిక్‌ను నిషేధించడంలో చేస్తున్న నిర్లక్ష్యం అత్యంత ప్రమాదకరంగా మారింది. రసాయనాల వినియోగం, వాతావరణ కాలుష్యం మానవ మనుగడకు చరమగీతం పాడే పరిస్థితులు ఏర్పడిన నేపథ్యంలో బాధ్యతయుతమైన, విజ్ఞానవంతమైన ప్రపంచ నిర్మాణం వైపు అంతర్జాతీయ సంస్థలు దృష్టి సారించాలి.

**(సెప్టెంబర్ 26 ప్రపంచ పర్యావరణ ఆరోగ్య దినోత్సవం)**

**- సుంకవల్లి సత్తిరాజు**
9704903463



# రాజ్యాంగ విలువల ఉల్లంఘన!



భారత ప్రజాస్వామ్య వ్యవస్థకు కేంద్ర ఎన్నికల సంఘం అత్యంత కీలక మైన, స్వతంత్ర రాజ్యాంగ వ్యవస్థ. దేశంలో నిష్పాక్షి కంగా, పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాల్సిన బాధ్యత ఈ వ్యవస్థపైనే ఆధారపడి ఉంది. కానీ, ఇటీవల వెలువడుతున్న కథనాలు, చోటుచేసు కుంటున్న పరిణామాలు కేంద్ర ఎన్నికల సంఘం పనితీరుపై, రాజ్యాంగ నిబంధనల ఉల్లంఘనలపై తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. రెండొం దల ఇరవై నాలుగు ప్రజాప్రతినిధుల సభ ఎన్నికల ప్రణాళిక వెలువడే కొద్దిరోజుల ముందు అకస్మా త్తుగా భారత ఎన్నికల అధికారిగా నియమితులైన జ్ఞానేష్ కుమార్ వ్యవహారశైలి, ఆ నియామకం వెనుక ఉన్న రాజకీయ ప్రాధాన్యతలు ఇప్పుడు దేశవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. గత పది నెలల కాలంలో కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కార్యాలయం నుంచి వెలువడిన అనేక కీలక ప్రకటనలు, నిర్ణయాలు అత్యధిక సంఖ్యలోని అధికారుల ఆమోదం లేకుండానే విడుదలయ్యాయనే వార్త ప్రజాస్వామ్య ప్రియులను దిగ్భ్రాంతికి గురిచేస్తోంది. ఈ కాలంలో జ్ఞానేష్‌కుమార్ తీసుకున్న ఏకపక్ష నిర్ణయాలపై తోటి ఎన్నికల అధికారులు కనీసం పదునాలుగు సార్లు తమ తీవ్ర అభ్యంతరాలను వ్యక్తం చేశారంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. రాజ్యాంగంలోని మూడు వందల ఇరవై నాలుగో అధికరణం ప్రకారం.. ఎన్నికల సంఘం నిర్ణయాలు సాధ్యమైనంతవరకు ఏకాభిప్రాయంతో, లేదంటే కనీసం అత్యధిక సభ్యుల అంగీకారంతో జరగాలి. రాజ్యాంగం ఈ అధికారాలను 'సంఘానికి' ఇచ్చిందే తప్ప ఏ ఒక్క వ్యక్తికి కాదు. కానీ, రాజ్యాంగ నిబంధనలను పక్కనబెట్టి ఏకపక్షంగా వ్యవహరించడం వ్యవస్థల నిర్వీర్యానికి అద్దం పడుతోంది. అత్యంత ఆందోళనకరమైన విషయమేమి టంటే, ఓటర్ల జాబితా రూపకల్పన వంటి అత్యంత కీలకమైన పది నెలల కాలంలో ఏకంగా పన్నెండు కోట్ల మంది భారతీయులు ఓటర్ల జాబితాలో తమ స్థానాన్ని కోల్పోవడం. తగినంత నోటీసు లేకుండా, వివక్షపూరితంగా తమ పేర్లను తొలగించారని బాధి తులు, ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఓటర్ల జాబితా ప్రజాస్వామ్యానికి వెన్నెముక వంటిది. దానిలోని పారదర్శకతనే ప్రశ్నించే పరిస్థితి వస్తే, ఇక ఎన్నికల నిర్వహణలో నిష్పాక్షికత ఎక్కడ ఉంటుందనేది ప్రధానమైన ప్రశ్నగా మారుతుంది. ఇంతకీ ఈ జ్ఞానేష్ కుమార్ ఎవరు? ఆయన నేపథ్యం ఏమిటి? కేరళ విభాగానికి చెందిన ఉన్నతాధికారి అయిన జ్ఞానేష్ కుమార్ కాన్పూర్ సాంకేతిక విద్యాలయం నుండి పట్టా పొందారు. కేరళలో కాంగ్రెస్, వామపక్ష ప్రభుత్వాల హయాం లో అనేక కీలక శాఖల్లో పనిచేశారు. అనంతరం కేంద్ర పరిపాలనలోకి వచ్చి రక్షణ శాఖ, పార్లమెం టరీ వ్యవహారాల శాఖ, హోం శాఖలలో కీలక బాధ్యతలు నిర్వర్తించారు. కేంద్ర హోంశాఖలో పనిచేస్తున్న సమయంలో ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత కలిగిన ప్రాజెక్టులలో ఆయన కీలక పాత్ర పోషించారు. జమ్మూ కాశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పించే రాజ్యాంగ నిబంధన రద్దు ప్రక్రియ లోనూ, రామ్ మందిర్ ట్రస్ట్ ప్రారంభ నియామకా ల్లోనూ, మరియు బహూరాష్ట్ర సహకార సంఘాల చట్ట సవరణల రూపకల్పనలోనూ ఆయన పాత్ర ప్రధానమైనది. కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ కార్యదర్శిగా పనిచేసి పదవీ విరమణ పొందిన రెండు నెలల్లోపే ఆయనను ఎన్నికల అధికారిగా నియమించడం గమనార్హం. ఈ నియామకం వెనుక ఉన్న ప్రక్రియ మరింత వివాదాస్పదమైనది. గత నిబంధనలను సవరిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన చట్టం ప్రకారం...ఎన్నికల అధికారులను ఎంపిక చేసే ముగ్గురు సభ్యుల కమిటీ నుంచి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని తొలగించారు. ఆ స్థానంలో కేవలం ప్రధాని, కేంద్ర హోంమంత్రి, ప్రతిపక్ష నేత మాత్రమే ఉంటారు. దీనివల్ల నియా మక ప్రక్రియలో పూర్తిస్థాయిలో ప్రభుత్వానిదే పైచేయి అవుతుందని, స్వతంత్రత దెబ్బతింటుం దని సుప్రీంకోర్టు గతంలో స్పష్టం చేసినప్పటికీ, ప్రభుత్వం తన నిర్ణయానికే కట్టుబడింది. మార్చిలో అధికారిగా ఉన్న అరుణ్ గోయల్ అకస్మాత్తుగా రాజీనామా చేయడం, ఆ వెంటనే ఈ నూతన చట్టం కింద జ్ఞానేష్ కుమార్ నియామకం జరగడం అనేక అనుమానాలకు తావిచ్చింది. ఆయన కుటుంబ నేపథ్యం కూడా వివాదా లకు అతీతంగా ఏమీ లేదు. ఆయన కుమార్తె జిల్లా అధికారిగా ఉన్న సమయంలో ఒక విద్యార్థిని పై కక్షపూరితంగా చర్యలు తీసుకున్నందుకు అలహాబాద్ కోర్టు తీవ్రంగా మందలించి.. ఐదు లక్షల రూపాయల జరిమానా విధించారు కూడా.. ఒకవైపు స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన ఎన్నికల సంఘాన్ని ప్రభుత్వం తన పరిపాలనా విభాగంగా మార్చుకుంటోందన్న విమర్శలు రావడం, మరో వైపు రాజ్యాంగం స్పష్టం చేసిన అధికరణం ప్రకా రం ఏకాభిప్రాయ నిర్ణయాలు జరగకపోవడం భారత ప్రజాస్వామ్య భవిష్యత్తుకు శుభసూచకం కాదు. రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా, నిష్పా క్షికంగా వ్యవహరించినప్పుడే ప్రజాస్వామ్యంపై ప్రజలకు విశ్వాసం పునరుద్ధరించబడుతుంది. దేశంలో ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం సడలిపోతే రాజ్యాంగ వ్యవస్థకే తీవ్ర ముప్పుగా పరిణమిస్తుంది. ప్రతిపక్షాలు లేవ నెత్తుతున్న అభ్యంతరాలను, ఉన్నత న్యాయస్థానం గతంలో చేసిన సూచనలను పరిగణనలోకి తీసుకుని ఎన్ని కల సంఘం తన పనితీరును సమీక్షించు కోవా ల్సిన అవసరం ఎంతైనా ఉంది. సంఘం సభ్యుల మధ్య సమిష్టి నిర్ణయాధికారం పునరుద్ధరించబడి, ఓటర్ల జాబితా రూపకల్పనలో పూర్తి పారదర్శకత పాటిస్తేనే రాజ్యాంగ బద్ధమైన బాధ్యత నెరవేరుతుంది. ప్రజాస్వామ్య పరిరక్షణకు స్వతంత్ర వ్యవస్థల పరిరక్షణే ఏకైక మార్గం.





**- వెంక గారి భూమయ్య**
9848559863

## ఆర్నబ్..

ఆకాశమంతా నల్లని ముసుగేసిన వేళ!
కడలి పురిటి నొప్పుల్లా అల్పపీడనం
తీరంపై మహోగ్రంగా పడుతూ లేస్తూ
చేతులు చాచిన కల్లోల కెరటాలతో
జనసామాన్యాన్ని అతలాకుతలం చేసింది!
వాయుగుండం మహాగండమై
గాలీవానాతో కలిసి పూనకం తెచ్చుకొంటే
కళింగపట్నం కళింగయుద్ధమై
ఉత్తరాంధ్ర వెన్నువిరిగింది
మన్యం మసకబారింది

గోదారి గందరగోళమైపోయింది
రాలిన ఆశల పంటల ముందు
రైతు నిస్తేజమయ్యేడు
సంద్రం ఒడ్డునే బందీయైన పడవలు
మత్యకారుల కడుపులో ఆకలి సునామీ రేపాయ్
పడగలెత్తిన నదులు కాటేయడంతో
కూడూ గూడూ కొట్టుకుపోయి పేదరికం
దిక్కులేని పక్షిలా చలికి వణుకుతోంది!

ప్రకృతి కన్నెర్రజేస్తే..
ఆకాశానికీ భూమికీ యుద్ధమొచ్చినట్టే
చినుకు శరాలు భూమి గుండెల్ని ఛిద్రం చేస్తే
కడలి కెరటాలు మృత్యునాల్కలై ఎగసిపడతాయ్
జీవనపోరాటం నిల్చిపోయి..
జీవుల అస్తిత్వమే ఇగిరిపోతుంది..!

**- భీమవరపు పురుషోత్తమ్**
9949800253

# హౌస్ వైఫ్ లాగే, హౌస్ హస్బెండ్?



మారుతున్న కాలానికి అనుగుణంగా మనుషులు మారాలి, మనసులు మారాలిమారుతున్న కాలాన్ని ఆపలేం. కానీ ఆ మార్పును అర్థం చేసుకుని మన ఆలోచనలను మార్చుకోవచ్చు. ఒకప్పుడు బాల్యవివాహం సమాజంలో సాధారణం. వితంతు వివాహం ప్రశ్నార్థకం. స్త్రీలకు చదువెం దుకు? అన్నది సహజమైన ప్రశ్న. అదే సమాజం నేడు స్త్రీలు లేని రంగమేది? అని అడిగే స్థాయికి వచ్చింది. ఇది కేవలం కాలమార్పు కాదు, మనస్తత్వ పరిణామంఇప్పుడు కుటుంబ వ్యవస్థలో మరో మార్పును అర్థం చేసుకోవాల్సిన సమయం వచ్చింది. తిరువణ్ణామలైకి చెందిన వైద్య దంపతుల విడాకుల కేసును విచారించిన మద్రాసు హైకోర్టు మదురై ధర్మాసనం న్యాయమూర్తులు జి.ఆర్. స్వామినాథన్, ఎం.డి. సుమతి, హౌస్ వైఫ్ ఉండగలిగినప్పుడు హౌస్ హజ్బెండ్ కూడా ఉండ వచ్చు. అది కొత్త సాధారణంగా మారాలి అన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. గృహ నిర్వహణకు లింగభేదం లేదని, భార్యాభర్తల పాత్రలు మారుతున్న సామా జిక వాస్తవికతను గుర్తించాల్సిన అవసరం ఉందని ధర్మాసనం పేర్కొందిఇది ఒక మాటగా తీసిపారేయాల్సిన వ్యాఖ్య కాదు. కుటుంబం, వివాహం, ఉద్యోగం, బాధ్యతలపై మనం ఇప్పటికీ మోస్తున్న పాత నిర్వచనాలను పునఃపరిశీలిం చాల్సిన అవసరాన్ని ఇది గుర్తుచేస్తోందిఒకప్పుడు పెళ్లి అంటే అమ్మాయి అత్తవారింటికి వెళ్లడం. భర్త సంపాదిం చడం, భార్య ఇంటిని చూసుకోవడం సంప్రదాయంగా ఏర్పడిన పాత్రలు. కానీ నేడు పరిస్థితులు మారాయి. మహిళలు వైద్యులు, ఇంజినీర్లు, శాస్త్రవేత్తలు, అధికారులు, వ్యాపారవేత్తలు, పైలట్లు, సైనికులుగా అన్ని రంగాల్లో ముందుకు వస్తున్నారు. ఆర్థిక స్వాతంత్ర్యం, వృత్తి ప్రాధాన్యం, వ్యక్తిగత నిర్ణయ స్వేచ్ఛ, ఇవన్నీ వారి జీవితంలో ముఖ్యమైన భాగాలయ్యాయిఅలాంటి సమయంలో ఉద్యోగం చేయాలంటే పెళ్లి వద్దు అనే పరిస్థితి ఏర్పడితే, పరిష్కారం మహిళల ఆశయాలను వెనక్కి నెట్టడం కాదు. కుటుంబ బాధ్యతలను ఇద్దరూ ఎలా పంచుకోవచ్చో ఆలోచించడం

ఇక్కడే హౌస్‌హజ్బెండ్ అనే ఆలోచన ప్రాధాన్యం సంతరించుకుంటుంది. భార్య ఉద్యోగం చేస్తే భర్త ఇంటిని చూసుకోవడంలో తప్పేముంది? పిల్లల పెంపకం, వంట, ఇంటి నిర్వహణ, వృద్ధుల సంరక్షణ, ఇవి ఆడవారి పనులే అన్న భావన ఎందుకు ఉండాలి? ఇల్లు నడపడం కూడా బాధ్యతే. సంపాదనకు ఆర్థిక విలువ ఉన్నట్టే, ఇంటి నిర్వహణకు సామాజిక విలువ ఉంది. పనిస్వభావం ఆధారంగా గౌరవం మారకూడదు, లింగం ఆధారంగా మారకూడదు. ఇది మహిళల స్వాతంత్ర్యాన్ని తగ్గించే ఆలోచన కాదు. అందుకు విరుద్ధంగా, ఇద్దరి స్వేచ్ఛను గౌరవించే కుటుంబ వ్యవస్థకు దారి సుప్రీంకోర్టు తీర్పుల్లోనూ వివాహం మహిళ వ్యక్తిత్వాన్ని, స్వతంత్రతను చెరిపివేయదనే సూత్రం స్పష్టంగా కనిపిస్తుంది. వ్యక్తిగత ఎంపిక, గౌరవం, స్వయం నిర్ణయం, వృత్తి ఆశయాలకు రాజ్యాంగ విలువలు రక్షణ కల్పిస్తున్నాయని కోర్టు పలు సందర్భాల్లో పేర్కొంది

అందుకే రేపటి కుటుంబంలో అత్తవారిల్లు-మామగారిల్లు అనే సరిహద్దుల కంటే మన ఇల్లు అనే భావనే ముఖ్యం కావాలి. అవసరమైతే అమ్మాయి ఇంట్లో ఉండొచ్చు. అవసరమైతే అబ్బాయి అత్తవారింట్లో ఉండొచ్చు. భార్య సంపాదించొచ్చు. భర్త ఇంటిని చూసుకోవచ్చు. లేక ఇద్దరూ సంపాదిస్తూ, ఇద్దరూ ఇంటిని పంచుకోవచ్చుకాలం మారింది. కుటుంబం కూడా మారాలి.ఆడవారికి హక్కులు కావాలంటే మగవారికి బాధ్యతల ఎంపిక కూడా ఉండాలి.హౌస్ వైఫ్ కు గౌరవం ఉన్న సమాజంలో హౌస్ హజ్బెండ్ కూ అదే గౌరవం ఉండాలి. మనుషులు మారితేనే మనసులు మారతాయి. మనసులు మారితేనే సమాజం ముందుకు సాగుతుంది



**- కొలను వెంకటేశ్వర రెడ్డి**
9346995566

# గర్భ నిరోధంపై అవగాహన... ఆధునిక విధానాలు





ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 26న ప్రపంచ వ్యాప్తంగా జరుపుకునే ప్రపంచ గర్భనిరోధక దినోత్సవం (World Contraception day) మహిళా ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, యువతశక్తి, సమాజ అభివృద్ధి గురించి అవగాహన పెం పొం దించే ప్రధాన దినంగా గుర్తించబడింది. ఈ దినోత్సవం ప్రధానంగా గర్భనిరోధక పద్ధతుల సురక్షిత, సమర్థవంతమైన వినియోగం, వ్యక్తిగత మరియు జంట హక్కులపై దృష్టి సారించడం కోసం ఏర్పాటు చేయబడింది. గర్భనిరోధక పద్ధ తుల అవగాహన కేవలం వ్యక్తిగత సమస్యలకు పరిమితం కాకుండా సమాజం, దేశ స్థిరత్వానికి కూడా కీలకంగా ఉంది.

భారతదేశంలో కుటుంబ నియంత్రణకు సంబంధించిన అవగాహన ప్రాచీన కాలం నుంచే ఉంది. ఆయుర్వేద గ్రంథాలలో ఫర్టిలిటీ నియంత్రణ, మూలికల ఆధారిత గర్భనిరోధక పద్ధతులు వివరంగా వర్ణించబడ్డాయి.

మహాభారత, రామాయణ కాలంలో కూడా కుటుంబ పరిమాణాన్ని నియంత్రించడంలో వ్యక్తిగత బాధ్యత, సమాజ పరి మితుల ప్రాధాన్యం ప్రస్తావించ బడింది. 20వ శతాబ్దంలో, జనాభా విస్తరణ, మహిళా ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం ప్రధాన సమస్యలుగా మారడంతో, అంతర్జాతీయంగా గర్భనిరోధక అవగాహనపై ప్రత్యేకదృష్టి సారించడం ప్రారంభమైంది. 2007లో InternationalPlannedParenthood Federation (IPPF) సెప్టెంబర్ 26ని ప్రపంచ గర్భ నిరోధక దినోత్సవంగా ప్రకటిం చింది.

గర్భనిరోధక పద్ధతులు మూడు ప్రధాన వర్గాల్లో విభజించవచ్చు. సంక్లిష్టత లేని పద్ధతులలో కండమ్, డయాఫ్రాగమ్, సర్వెంటైన్ ఉన్నాయి. ఇవి లైంగిక వ్యాధుల నుండి రక్షణ ఇచ్చే విధంగా, గర్భధారణను కూడా నివారిస్తాయి. హార్మోనల్ పద్ధతులలో గర్భ నిరోధక పిల్లు, ఇంజెక్షన్లు, ఇంప్లాంట్లు ముఖ్యమైనవి, ఇవి హార్మోన్ల మార్పుల ద్వారా గర్భసాధ్యాన్ని నిరోధిస్తాయి. ప్రకృతి ఆధారిత పద్ధతులలో ఫర్టిలిటీ అవేర్నెస్, చక్ర గణన, శరీర ఉష్ణోగ్రత పద్ధతులు ఉన్నాయి, వీటిని జాగ్రత్తగా ఉపయోగిస్తే గర్భనిరోధకత సాధ్యమవుతుంది. గణాంకాల ప్రకారం, ప్రపంచ వ్యాప్తంగా స్త్రీలలో సుమారు 60 శాతం మంది సురక్షిత గర్భనిరోధక పద్ధతులను ఉపయోగిస్తారు, అయితే అభివృద్ధి చెందని కొన్ని దేశాల్లో ఈ సంఖ్య 30 శాతం కన్నా తక్కువ. భారత్‌లో స్త్రీలలో సుమారు 58 శాతం మంది మాత్రమే సురక్షిత గర్భనిరోదక పద్ధతులను ఉపయోగిస్తున్నారు. 2015లో ఇది 50 శాతం మాత్రమే ఉండటం, క్రమంగా మార్పు జరుగుతున్నదని సూచిస్తుంది.

గర్భనిరోధక పద్ధతుల వినియోగం మహిళా ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, ఆర్థిక స్వావలంబన, యువత ప్రగతికి కీలకంగా మారింది. అసురక్షిత గర్భ నిరోధకత, అనూహ్య గర్భస్రావాలు, గర్భపాతం వల్ల ఏర్పడే ఆరోగ్య సమస్యలు తగ్గుతాయి. పిల్లల సంఖ్యను నియంత్రించడం ద్వారా ప్రతి పిల్లకు సరైన పోషణ, విద్య, వైద్య సౌకర్యం లభిస్తుంది. అలాగే, కుటుంబ వ్యయం, వైద్య ఖర్చులు సమర్థవంతంగా విభజించవచ్చు. సురక్షిత గర్భనిరోధక పద్ధతులు యువతకు చదువు, కెరీర్ అవకాశాలను తగ్గకుండా పెంపొందిస్తాయి.

భారతదేశంలో కుటుంబ సంక్షేమ, గర్భనిరోధక అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా కొనసాగుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత కండమ్, ఇంప్లాంట్, శిక్షణా వర్క్‌షాప్‌లు అందించడం జరుగుతుంది. ఆరోగ్య కేంద్రాలు, ఆయుష్, వైద్య పాఠశాలలు ద్వారా మహిళలు, యువతకు అవగాహన కల్పించ బడుతుంది. అయినప్పటికీ, గ్రామీణ ప్రాంతాల లోపలి విద్య, సాంప్రదాయ పరిమితుల కారణంగా అవగాహన ఇంకా తక్కువగా ఉంది. ఈ కారణంగా, తల్లితనం రేటు, బాలికల ఆరోగ్యం, మహిళల ఆర్థిక స్వావలంబనపై ప్రతికూల ప్రభావం పడుతుంది.

ప్రపంచ గర్భనిరోధక దినోత్సవం సందర్భంగా వర్క్‌షాప్‌లు, సదస్సులు, సామాజిక మీడియా ప్రచారాలు, పబ్లిక్ క్యాంపెయిన్లు జరుగుతాయి. యువత, మహిళలు, కుటుంబాలు, వృద్ధులు, సర్వసాధారణ ప్రజలకు సులభంగా, స్పష్టంగా సమాచారం అందించడానికి కృషి జరుగుతుంది.

ఈ దినోత్సవం ద్వారా ప్రతి వ్యక్తికి అందించే ముఖ్య సందేశం... ప్రతి వ్యక్తి, ప్రతి జంట గర్భనిరోధక పద్ధతుల గురించి అవగాహన కలిగి, వాటిని సురక్షితంగా ఉపయోగించడం అనేది వారి హక్కు. ఇది మహిళా శక్తి, కుటుంబ సంక్షేమం, సమాజ అభివృద్ధికి మూలాధారం.

భారతీయ సాంప్రదాయంలో స్త్రీలకు, కుటుంబానికి, సమాజానికి ఉన్న హక్కులు, బాధ్యతల ఆధారంగా, సురక్షిత గర్భ నిరోధకత, మహిళా ఆరోగ్యం, పిల్లల పౌష్టికాహారం వంటి అంశాలు ప్రాచీన కాలం నుంచే గుర్తించబడ్డాయి. ఈ దినోత్సవం ఆధునిక సమాజంలో ఆ వారసత్వాన్ని కొనసాగిస్తూ, ప్రతిమహిళ, కుటుంబం, సమాజం కోసం అవగాహన, సంకల్పం పెంపొందిస్తుంది.

ప్రపంచ గర్భనిరోధక దినోత్సవం కేవలం గుర్తింపు మాత్రమే కాదు. సురక్షిత, సమర్థవంతమైన, సులభంగా అందుబాటులో ఉండే గర్భనిరోధక పద్ధతులు సమాజానికి ప్రగతి, ఆరోగ్యం, మహిళా శక్తి, ఆర్థిక స్వావలంబన తీసుకొస్తాయి. ప్రతి వ్యక్తి ఈ హక్కును తెలుసుకొని, సురక్షితంగా ఉపయోగించాలి. తద్వారా భారతీయ సమాజం మరియు ప్రపంచ సమాజం ఆరోగ్యకరంగా, శక్తివంతంగా మారుతుంది.

**సెప్టెంబర్ 26... ప్రపంచ గర్భనిరోధక దినోత్సవం**

**- రామ కిష్టయ్య సంగన భట్ల**
9440595494

**ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు**
manamlekhalu@ gmail.com మెయిల్ అడ్రస్‌కు పంపగలరు
ఈ పేపర్ కోసం....
https://www.manamepaper.com/ వెబ్‌సైట్‌లో చూడండి– ఎడిటర్

# వరద ముప్పు తప్పింది.. భయం వద్దు!



- నదీ పరివాహక ప్రాంతాల్లో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు విస్తృత పర్యటన
- పంట నష్టంపై సమగ్ర సర్వే.. రైతాంగానికి పూర్తి పరిహారం
- సమర్థవంతంగా పనిచేసిన యంత్రాంగానికి మంత్రి అభినందనలు

**శ్రీకాకుళం, సెప్టెంబర్ 25:** జిల్లాలో కురిసిన భారీ వర్షాలు, నాగావళి, వంశధార నదుల వరద ఉధృతి వల్ల ప్రజలెవరూ ఆందోళన చెందవద్దని, జిల్లాలో ప్రమాదకర పరిస్థితులు ఏవీ లేవని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ మహేశ్వర్ రెడ్డి, ఇతర అధికారులతో కలిసి మంత్రి నాగావళి నదీ పరివాహక ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. శ్రీకాకుళం గ్రామీణ మండలంలోని కల్లేపల్లి, కిల్లిపాలెం, మోపసుబం దరు, పీజీ పేట తదితర గ్రామాల్లో పర్యటించి పరిస్థితులను స్వయంగా పరిశీలించారు. కల్లేపల్లి వద్ద రహదారి విస్తరణకు హామీ ఇచ్చిన ఆయన అనంతరం, నగరం లోని పాత బ్రిడ్జి, హయాతి నగర్, కొత్త బ్రిడ్జి వద్ద ఉధృ తంగా ప్రవహిస్తున్న నాగావళి నది ప్రవాహాన్ని వీక్షించారు.

**ఒడిస్సా అధికారులతో సంప్రదింపులు.. క్రమంగా తగ్గుతున్న ప్రవాహం**

ఈ సందర్భంగా విలేకరులతో మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ - 'గత మూడు రోజులుగా జిల్లా వ్యాప్తంగా దాదాపు 180 మిమీ భారీ వర్షపాతం నమోదైంది. దీనికి తోడు వంశధార, నాగావళి నదుల ఎగువన ఉన్న ఒడిస్సా క్యాచ్మెంట్ ప్రాంతంలోనూ విపరీతమైన వర్షాలు కురవడంతో నదుల్లోకి వరద నీరు భారీగా వచ్చి చేరింది. నాగావళి నది ఉధృతి ప్రస్తుతం కొనసాగుతున్నప్పటికీ శ్రీకాకుళం నగరంలోకి నీరు చేరే పరిస్థితి ఎక్కడా లేదు. గ్రామీణ ప్రాంతాల్లోని కొన్ని గ్రామాలకు మాత్రమే నీరు చేరుతోంది. ఇంకో రెండు మూడు గంటల్లో ఉధృతి క్రమంగా తగ్గుముఖం పడుతుంది. ఒడిస్సా అధికారులతో కూడా మాట్లాడాం, అక్కడ కూడా వర్షాలు పూర్తిగా అదుపులోనే ఉన్నాయి' అని వివరించారు. కొన్ని లోతట్టు గ్రామాల్లో ఎదురవుతున్న ఇబ్బందులపై స్పందిస్తూ - 'ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి యంత్రాంగం సిద్ధంగా ఉంది. ఒకవేళ ఇళ్లలోనే ఉన్నప్పటికీ మధ్యాహ్న భోజన పథకాన్ని ఉపయోగించుకుని ఆయా గ్రామాల్లో భోజన సదుపాయాలు కల్పిస్తున్నాం' అని తెలిపారు.

**రైతాంగానికి అండగా ఉంటాం.. పంటల రక్షణకు చర్యలు**

భారీ వర్షాల వల్ల జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ, ఉద్యానవన పంటలతో పాటు రోడ్లు, కొన్ని చెరువులు దెబ్బతిన్నాయని మంత్రి పేర్కొన్నారు. 'ఇప్పటికే కలెక్టర్ ఆదేశాలతో పంట నష్టంపై సమగ్ర ఎన్యూమరేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. మునిగిన వరి పంటను రక్షించేందుకు వ్యవసాయ శాస్త్రవేత్తల నేతృత్వంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నాం. నీరు తగ్గిన వెంటనే పంట మళ్లీ కోలుకునేలా తగిన మందులను సూచిస్తాం. అవసరమైతే మళ్లీ నాట్లు వేసుకునేలా రైతులను ఆదుకుంటాం. రైతులతో పాటు రోడ్లు, చెరువులు, ఇతర ఆస్తులు నష్టపోయిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందిస్తాం. వాటిని పునరుద్ధరిస్తామని. వర్షాలు తగ్గగానే అభివృద్ధి, పునరుద్ధరణ పనులను వేగవంతం చేస్తాం' అని హామీ ఇచ్చారు.

**రాత్రింబవళ్ళు శ్రమిస్తున్న అధికారులకు అభినందనలు**

గడిచిన నాలుగు రోజులుగా రాత్రింబవళ్ళు రెస్క్యూ, సహాయక చర్యల్లో పాల్గొంటున్న జిల్లా కలెక్టర్, ఎస్పీ, ప్రజాప్రతినిధులు, ఇతర శాఖల అధికారుల పనితీరును మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లలోని వారిని ముందస్తుగా పాఠశాలలు, సైక్లోన్ షెల్టర్లకు తరలించడం ద్వారా ఎక్కడా చిన్న అవాంఛనీయ సంఘటన గానీ, ప్రాణనష్టం గానీ జరగకుండా సమర్థవంతంగా అడ్డుకున్నారని కొనియాడారు.ఈ పర్యటనలో శశ్రీకాకుళం శాసన సభ్యులు గొండు శంకర్, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శ్రావణ్ కుమార్, ప్రత్యేక అధికారి లవరాజు, తాసిల్దార్ గణపతిరావు, కూటమి నాయకులు కార్యకర్తలు తదితర అధికారులు పాల్గొన్నారు.

## అర్నబ్ తుఫాన్ ప్రభావంతో పంట నష్టాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే దాట్ల



**కాట్రేనికోన, సెప్టెంబర్ 25(మనం ప్రతినిధి):** ఇటీవల ఏర్పడిన అర్నబ్ తుఫాన్ ప్రభావంతో ముమ్మిడివరం నియోజకవర్గంలో దెబ్బతిన్న పంటలను ముమ్మిడివరం శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు శుక్రవారం కాట్రేనికోన మండలం గెద్దనపల్లి లో వరిచేలను పరిశీలించారు.ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి పంట నష్టం వివరాలను తెలుసుకున్నారు. వెంటనే సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేసి, పంట నష్టాన్ని సమగ్రంగా అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక అందించాలని సూచించారు.రైతులకు జరిగిన పంట నష్టాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, నిబంధనల ప్రకారం తగిన పరిహారం మరియు సహాయం అందేలా కృషి చేస్తానని దాట్ల సుబ్బరాజు రైతులకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గుత్తుల సాయి, చెల్లి సురేష్, నడింపల్లి సుబ్బరాజు, నాగిడి నాగేశ్వరరావు, ఆకాశం శ్రీనివాస్, పి ఎస్ ఎన్ రాజు, వంగా దుర్గ బాబు, వెంట్రు సుధీర్, గోడి వెంకట్రావు, కముజు రాంబాబు,బండారు యేసు, బండారు ఏసు, నల్ల రామకృష్ణ, సుంకర బుజ్జి కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు, సంబంధిత అధికారులు, రైతులు ప్రజలు పాల్గొన్నారు.

## శంఖవరం రహదారి మరమ్మత్తులకు 1.50 కోట్లు మంజూరు



**శంఖవరం సెప్టెంబర్ 25 మనం ప్రతినిధి:** శంఖవరం గ్రామ ప్రజలు గుంతల రహదారితో ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యను పరిష్కరించేందుకు ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ డిఎంఎఫ్ నిధుల నుండి 1 కోటి 50 లక్షల రూపాయులను మంజూరు చేయించడంతో టిడిపి రాష్ట్ర కార్యదర్శి పర్వత సురేష్ ధన్యవాదాలు తెలిపారు. మండల కేంద్రం శంఖవరంలోని సురేష్ గృహంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఆర్థిక భారంతో సతమతమం అవుతున్నప్పటికీ ప్రజా సమస్యల పరిష్కారానికి ఎప్పుడూ ముందే ఉంటుందన్నారు. మన శంఖవరం గ్రామంలో క్షేత్రస్థాయిలో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు ఎమ్మెల్యే సత్యప్రభకు

వివరిస్తుండడంతోనే పలు పనులకు అభివృద్ధి నిధులు మంజూరు చేసి ఆమె చిత్త శుద్ధిని చాటుకుంటుందన్నారు. శంఖవరం గ్రామం మీదుగా వెళ్ళుతున్న టిప్పర్ల సమస్యను తొలగించేందుకు బైపాస్ రహదారి నిర్మాణంపైన ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేసి పంపించినట్లు పేర్కొన్నారు. భూ సేకరణకు రైతులు సహకరిస్తే త్వరలోనే ఆ సమస్య పరిష్కారమవుతుందన్నారు. శంఖవరం గ్రామంలో ప్రస్తుతం డిఎంఎఫ్ నిధులతో 590 మీటర్ల మేర గుంతలు పడిన ప్రాంతాల్లో రోడ్డు వేయడం జరుగుతుందన్నారు. సుమారు 7 కోట్ల రూపాయులతో మొత్తం రహదారి నిర్మాణానికి ప్రణాళికలు పంపించగా, ఆర్థిక శాఖలో కూడా ఆమోదం పొందిందన్నారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళుగా బావిస్తూ పనులు చేపడుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ చింతనీడి కుమార్, టిడిపి నేతలు దాసరి బాబూరావు, బొర్రా లచ్చబాబు, బైరా శ్రీరామ్మూర్తి, పడాల సతీష్, బొర్రా వాసు, జట్లా శ్రీను, బొర్రా వర ప్రసాద్, రౌతు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్సార్సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా అంగూరి లక్ష్మీశివకుమారి



**శంఖవరం సెప్టెంబర్ 25 మనం ప్రతినిధి:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి ఆదేశాల మేరకు మాజీ ఎమ్మెల్సీ, దళిత మహిళా నాయకురాలు అంగూరి లక్ష్మీశివకుమారి వైఎస్సార్సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమితులయ్యారు. పార్టీ రాష్ట్ర స్థాయిలో కీలక బాధ్యతలను ఆమెకు అప్పగించడంపై దళిత నాయకులు, వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అంగూరి లక్ష్మీశివకుమారికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. దళిత మహిళా నాయకురాలికి రాష్ట్ర స్థాయిలో కీలక బాధ్యతలు అప్పగించడం పట్ల పలువురు నాయకులు సంతోషం వ్యక్తం చేశారు. పార్టీ అభివృద్ధికి, ప్రజా సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఆమె తన వంతు కృషి చేస్తారని ఆకాంక్షించారు.

రాష్ట్ర అధికార ప్రతినిధిగా అంగూరి లక్ష్మీశివకుమారి పార్టీ విధానాలను ప్రజలకు వివరించడంతోపాటు, ప్రజా సమస్యలను పార్టీ దృష్టికి తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషించాలని నాయకులు, కార్యకర్తలు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమెకు మరోసారి శుభాకాంక్షలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత బాధ్యతలు చేపట్టాలని ఆకాంక్షించారు.



## కాట్రేనికోన ఎస్సైగా దుర్గా శ్రీనివాస్ భాధ్యతలు స్వీకరణ

**కాట్రేనికోన సెప్టెంబర్ 25 మనం ప్రతినిధిః** కాట్రేనికోన పోలీస్ స్టేషన్ ఎస్ హెచ్ ఓ గా దుర్గా శ్రీనివాస్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. రావులపాలెం నుండి బదిలీపై ఇక్కడికి వచ్చారు. గతంలో సఖినేటిపల్లిఎస్సైగా పనిచేశారు . అదనపు ఎస్సై సత్యనారాయణ నుండి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్సై దుర్గా శ్రీనివాస్ మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల విషయంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకుకృషి చేస్తానన్నారు. గంజాయివంటి మాదక ద్రవ్యాల నిర్మూలనకు కృషి చేస్తానన్నారు. నూతన ఎస్ ఐ కు అదనపు ఎస్ ఐ సత్యనారాయణ, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు అనంతరం ముమ్మిడివరం సిఐ మోహన్ కుమార్ అమలాపురం డిఎస్పి టి ఎస్ ఆర్ కె ప్రసాద్ లను మర్యాదపూర్వకంగా కలిసేందుకు వెళ్లారు.

## సునీతకు స్వాగతం పలికిన ఈవో జల్లేపల్లి వెంకటరావు



**సింహాచలం, సెప్టెంబర్ 25, 2026:** సింహాచలం శ్రీ శ్రీ శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానంలో శుక్రవారం ఆలయ ఫౌండర్ ట్రస్టీ, చైర్మన్ పూసపాటి అశోక గజపతిరాజు సోదరి సునీతమ్మ స్వామివారిని దర్శించుకున్నారు.

ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి జల్లేపల్లి వెంకటరావు ఆమెకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం సునీతమ్మ ముందుగా ఆలయంలోని మహిమాన్వితమైన కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని, స్వామివారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆలయ కార్యనిర్వహణాధికారి జల్లేపల్లి వెంకటరావు ఆమెకు స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

## అంధులకు నిత్యావసర వస్తువులు అందజేత



**కాట్రేనికోన సెప్టెంబర్ 25 మనం ప్రతినిధి:** కాట్రేనికోన మండలం,గెద్దనపల్లి గ్రామానికి చెందిన యార్లగడ్డ రాంబాబు పిల్లలు నవ్య మరియు చందు పుట్టుకతో కంటి చూపు ఉన్న కొన్ని కారణాలతో చిన్న వయసులోనే చూపుకోల్పోయారు. వీళ్ళ కష్టాలు అడబాల మనోజ్ ద్వారా తెలుసుకున్న సూరపురెడ్డి సురేష్,, కూనవరం గ్రామానికి చెందిన మధుర సుమిత్ పుట్టినరోజు సందర్భంగా తల్లిదండ్రులు జాన్,భవానీల సహకారంతో రెండు వేల రూపాయల విలువైన నిత్యవసర వస్తువులు మరియు ఫ్రూట్స్ మారిశెట్టి సాయి స్వామి చేతుల మీదుగా శుక్రవారం అందించడం జరిగింది. దీనికి గాను ఆ కుటుంబ సభ్యులు దాతకు ధన్యవాదాలు తెలిపారు.

## యర్రవరంలో పంట నష్టంపై క్షేత్రస్థాయి పరిశీలన చేసిన ఎమ్మెల్యే సత్యప్రభ



**ఏలేశ్వరం,సెప్టెంబర్,25:-(మనం న్యూస్):** ఏలేశ్వరం మండలం యర్రవరం గ్రామంలో తుఫాను ప్రభావంతో దెబ్బతిన్న పంట పొలాలను ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, ఆర్డీఓ కె కృష్ణమూర్తితో కలిసి పరిశీలించారు. పంట పొలాల్లో చేరిన వరదనీటి ఉద్ధ ృతిని, పంటలకు జరిగిన నష్టాన్ని పరిశీలించి రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.తుఫాను కారణంగా పంటలు దెబ్బతిన్న రైతులకు ప్రభుత్వం తరఫున పంటనష్టం అందేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే సత్యప్రభ హామీ ఇచ్చారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని సమగ్రంగా అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక అందించాలని సూచించారు.రైతులకు అండగా ప్రభుత్వం అన్ని విధాలా చర్యలు తీసుకుంటుందని, నష్టపోయిన ప్రతి రైతుకు న్యాయం జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు.ఈ కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు జ్యోతుల పెదబాబు, బొదిరెడ్డి గోపి, పెంటకోట మోహన్, మండల తహసీల్దార్ కె కీర్తి, ఎంపీడీవో రామరాజు వర్మ, ఏవో రాజేష్, హెచ్వో దివ్యశ్రీ, స్థానిక నాయకులు బస్వా మహాలక్ష్మి ప్రసాద్, మైరాల కనకారావు, గంగిరెడ్ల మణికంఠ, పసల సూరిబాబు, అవసరాల సూర్య ప్రకాశ్రావు, సూతి బాబులు, బ్యాంక్ రాజు, నూకతాటి ఈశ్వరుడు, పసల వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

## జల్దాం-కత్తిపూడి బైపాస్ రహదారి నిర్మించాలి




**శంఖవరం సెప్టెంబర్ 25 మనం ప్రతినిధి:** రౌతులపూడి మండలం జల్దాం నుంచి శంఖవరం మండలం కత్తిపూడి వరకు బైపాస్ రహదారి నిర్మించి మైనింగ్ భారీ వాహనాల రాకపోకల నుంచి 13 గ్రామాల ప్రజలకు విముక్తి కల్పించాలని డిమాండ్ చేస్తూ శంఖవరంలో శంఖవరం గ్రామ అభివృద్ధి సేవా సంఘం ఆధ్వర్యంలో శాంతియుత రిలే నిరాహార దీక్షలు ప్రారంభమయ్యాయి.ఈ నెల 25 నుంచి 29వ తేదీ వరకు దీక్షలు చేపడుతున్నట్లు సంఘం ప్రతినిధులు తెలిపారు.దీక్షా శిబిరాన్ని బీజేపీ నాయకుడు చిలుకూరి రాంకుమార్ బీజేపీ శ్రేణులతో కలిసి సందర్శించి సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా శంఖవరం గ్రామ అభివృద్ధి సేవా సంఘం అధ్యక్షుడు మేకల కృష్ణ,ఉపాధ్యక్షుడు గునపర్తి అపురూప్,బీజేపీ నాయకుడు చిలుకూరి రాంకుమార్ మాట్లాడుతూ మైనింగ్ భారీ వాహనాల రాకపోకలతో 13 గ్రామాల ప్రజలు ప్రతిరోజూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రధాన రహదారిపై భారీ వాహనాలు అధిక సంఖ్యలో రాకపోకలు సాగిస్తుండటంతో ప్రజలు భయాందోళనల మధ్య ప్రయాణించాల్సి వస్తోందన్నారు. ముఖ్యంగా విద్యార్థులు, వృద్ధులు,ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.జల్దాం నుంచి కత్తిపూడి వరకు బైపాస్ రహదారి నిర్మిస్తే మైనింగ్ భారీ వాహనాలను గ్రామాల వెలుపల నుంచి మళ్లించే అవకాశం ఉంటుందని,తద్వారా 13 గ్రామాల ప్రజలకు ట్రాఫిక్ సమస్య నుంచి ఉపశమనం కలుగుతుందని తెలిపారు.

## మాదకద్రవ్యాల నిర్మూలనకు యువతే ముందడుగు

- మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటేనే ఉజ్వల భవిష్యత్తు
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార కమిషనర్ పి.ఎస్. నాయుడు



**విశాఖపట్నం, సెప్టెంబర్ 25:** మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తి జీవితాన్ని మాత్రమే కాకుండా కుటుంబాన్ని, సమాజాన్ని, చివరకు దేశ భవిష్యత్తును తీవ్రంగా ప్రభావితం చేస్తుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార కమిషనర్ పి.ఎస్. నాయుడు అన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలనలో యువత కీలక పాత్ర పోషించాలని ఆయన పిలుపునిచ్చారు. ద్వారకానగర్ 5వ లైన్లోని ఫ్లైటగ్ ఇన్స్టిట్యూషన్లో నిర్వహించిన మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహనా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పి.ఎస్. నాయుడు మాట్లాడుతూ యువత దేశానికి అత్యంత విలువైన సంపద అని, వారి శక్తి, ప్రతిభ, ఆలోచనా విధానం దేశ ప్రగతికి ఉపయోగపడాలని అన్నారు.

తాత్కాలిక ఆనందం కోసం మాదకద్రవ్యాలకు అలవాటు పడటం వల్ల విద్య, ఉద్యోగం, ఆరోగ్యం, కుటుంబ సంబంధాలు, సామాజిక గౌరవం వంటి అనేక అంశాలు దెబ్బతింటాయని పేర్కొన్నారు. మాదకద్రవ్యాలకు 'నో' చెప్పడం ఒక వ్యక్తిగత నిర్ణయం మాత్రమే కాదు.. కుటుంబాన్ని, సమాజాన్ని, భవిష్యత్ తరాలను రక్షించే బాధ్యత అని ఆయన అన్నారు.

## జిల్లాలో మాదక ద్రవ్యాల రవాణా, వినియోగంపై గట్టి నిఘా

- కలెక్టర్ అభిషిక్త్ కిషోర్



**విశాఖపట్నం, సెప్టెంబర్ 25:** జిల్లాలో మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల సరఫరా, వినియోగం ఎక్కడా కనపడకూడదని, అందుకోసం గట్టి నిఘా ఉంచాలని జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరం లో మత్తుపదార్థాలు, మాదక ద్రవ్యాల నిరోధక జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గంజాయి సరఫరా అవుతున్న మార్గాలలో చెక్ పోస్టులను ఏర్పాటు చేసి, ఆకస్మిక దాడులను చేయాలని సూచించారు. గంజాయి, మత్తు పదార్థాల వలన జీవితాలు ఎలా నాశనం అవుతాయో యువతకు అవగాహన కల్పించాలన్నారు.

నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత్ భాగ్చి మాట్లాడుతూ పోలీసుల వద్ద 600 డ్రగ్ డిటెక్షన్ కిట్లు, బహిరంగ స్థలాల్లో గంజాయిని గుర్తించడానికి 9డాగ్ స్క్వాడ్ లు ఉన్నాయని పేర్కొన్నారు. అలాగే డ్రోన్ ద్వారా కూడా నిఘా ఉంచడం జరుగుతోందని, విద్యా సంస్థల్లో, డ్రగ్ స్పాట్స్ లో డెకాయ్ పార్టీ లు ఉన్నాయని తెలిపారు. ఈగల్ టీమ్ ద్వారా 30కేసు లను బుక్ చేసి 77మందిని అరెస్ట్ చేయడం జరిగిందనీ తెలిపారు. ఈ సమావేశం లో డి.ఆర్. ఓ విశ్వేశ్వర నాయుడు, ఆర్.డి. ఓ కళ్యాణ చక్రవర్తి, డి.సి.పి మేరీ ప్రశాంతి, ఈగల్ ఐ.జీ రవి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# కష్టం వచ్చిన వేళ ప్రభుత్వం తోడు: మంత్రి సత్యకుమార్



ధర్మవరం, సెప్టెంబరు 25(మనం న్యూస్): అనారోగ్యంతో బాధపడుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఆర్థిక భరోసాగా నిలుస్తోందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్య శాఖ మంత్రి, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ అన్నారు.ధర్మవరం ఎన్డీఏ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన 37 మంది లబ్ధిదారులకు రూ.21.96 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంత్రి స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితులు, చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు.

అనారోగ్య సమయంలో వైద్య ఖర్చులతో పాటు ఆర్థిక ఇబ్బందులు కూడా ఎదురవుతాయని, అలాంటి కుటుంబాలకు ప్రభుత్వం అందించే సాయం ఎంతో ఊరటనిస్తుందని మంత్రి తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సీఎంఆర్ఎఫ్ ప్రయోజనం అందేలా అధికారులతో సమన్వయం చేసుకుంటున్నామని చెప్పారు. ప్రజల ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం విషయంలో ప్రభుత్వం అండగా ఉంటుందని సత్యకుమార్ పేర్కొన్నారు.

# జిల్లా పరిషత్‌కు కొత్త చిరునామా

## కొత్తచెరువులో తాత్కాలిక కార్యాలయం ఘన ప్రారంభం
## ప్రజలకు పాలన మరింత చేరువ చేస్తాం: మంత్రి సవిత



పుట్టపర్తి సెప్టెంబర్ 25 మనం న్యూస్: శ్రీ సత్యసాయి జిల్లా ఏర్పాటైన తర్వాత స్థానిక సంస్థల పరిపాలనకు మరింత ఊతమిస్తూ కొత్తచెరువులో ఏర్పాటు చేసిన జిల్లా ప్రజా పరిషత్ తాత్కాలిక కార్యాలయం శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. రాష్ట్ర బీసీ, ఆర్థికంగా వెనుకబడిన తరగతుల సంక్షేమం, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత, జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డిలు వేద మంత్రోచ్ఛారణల నడుమ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఎస్. సవిత మాట్లాడుతూ శ్రీ సత్యసాయి జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టితో పనిచేస్తోందన్నారు. నూతన జిల్లా ఏర్పాటైన అనంతరం ప్రత్యేకంగా జిల్లా పరిషత్ కార్యాలయం అందుబాటులోకి రావడం వల్ల పరిపాలనా కార్యకలాపాలు మరింత సులభతరం కావడంతో పాటు గ్రామీణ ప్రజలకు ప్రభుత్వ సేవలు చేరువ అవుతాయని తెలిపారు. గతంలో ఉమ్మడి జిల్లాలోనే జిల్లా పరిషత్ కార్యాలయాలు ఉండేవని, ప్రస్తుతం శ్రీ సత్యసాయి జిల్లాకు ప్రత్యేక కార్యాలయం అందుబాటులోకి రావడం సంతోషకరమన్నారు.కొత్త కార్యాలయంలో సుమారు 47 మంది అధికారులు విధులు నిర్వహించనున్నారని, దీనివల్ల జిల్లా పరిషత్ పరిపాలన మరింత సమర్థవంతంగా కొనసాగుతుందని మంత్రి తెలిపారు. త్వరలోనే జిల్లాకు అవసరమైన ఇతర కార్యాలయాల నిర్మాణాలను కూడా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, తాగునీరు, పారిశుధ్యం, విద్య, వైద్యం, మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు.ఎల్నినో ప్రభావం నేపథ్యంలో జిల్లాలో ఎక్కడా తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. ప్రతి గ్రామంలో తాగునీటి పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. జిల్లాలో పారిశ్రామిక, మౌలిక వసతుల అభివృద్ధికి మంచి అవకాశాలు ఉన్నాయని, కియా వంటి అంతర్జాతీయ స్థాయి పరిశ్రమలతో పాటు గొల్లపల్లి జలాశయం వంటి కీలక వనరులను సమర్థంగా వినియోగించుకుని మరిన్ని పెట్టుబడులు, పరిశ్రమలను ఆకర్షించేలా మౌలిక వసతులను అభివృద్ధి చేయాలని తెలిపారు. అనంతరం కార్యాలయ ప్రాంగణంలో మంత్రి, కలెక్టర్, ప్రజాప్రతినిధులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, జిల్లా ప్రజా పరిషత్ ప్రధాన కార్యనిర్వహణాధికారి పి. విజయలక్ష్మి, పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ, జిల్లా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పంచాయతీరాజ్ సిబ్బంది, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జిల్లా పరిషత్‌కు కలెక్టర్ ప్రత్యేక అధికారి



పుట్టపర్తి, సెప్టెంబర్ 25(మనం న్యూస్): శ్రీ సత్యసాయి జిల్లా ప్రజా పరిషత్ పరిపాలనలో కీలక మార్పు చోటుచేసుకుంది. జిల్లా ప్రజా పరిషత్ ఎన్నికైన సభ్యుల సాధారణ పదవీకాలం గురువారంతో ముగియడంతో, జిల్లా పరిషత్ ప్రత్యేక అధికారిగా జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ ఏ. శ్యామ్ ప్రసాద్ శుక్రవారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. జిల్లా పరిషత్ పాలకవర్గ పదవీకాలం 24-09-2026తో ముగిసిన నేపథ్యంలో పంచాయతీరాజ్ చట్టం ప్రకారం జిల్లా పరిషత్ పరిపాలన, అభివృద్ధి కార్యక్రమాలు నిరంతరాయంగా కొనసాగేందుకు రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబర్ 129, తేదీ 19-09-2026 ద్వారా జిల్లా కలెక్టర్ను ప్రత్యేక అధికారిగా నియమించింది. ఈ మేరకు శుక్రవారం ఉదయం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ప్రత్యేక అధికారిగా బాధ్యతలు చేపట్టిన కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ను జిల్లా పరిషత్ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, గ్రామీణ ప్రాంతాల అవసరాలపై అధికారులతో కలెక్టర్ చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ జిల్లా పరిషత్ పరిధిలోని గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. తాగునీరు, రహదారులు, ప్రాథమిక విద్య, వైద్యం వంటి మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తామని పేర్కొన్నారు. పాలకవర్గ పదవీకాలం ముగిసినప్పటికీ ప్రజలకు అందించే సేవల్లో ఎలాంటి జాప్యం లేకుండా జిల్లా పరిషత్ పరిపాలన కొనసాగుతుందని స్పష్టం చేశారు. జిల్లా పరిషత్ నిధులను పూర్తి పారదర్శకతతో ప్రజోపయోగ కార్యక్రమాలకు వినియోగిస్తామని కలెక్టర్ తెలిపారు. గ్రామీణ ప్రాంతాల అవసరాలను గుర్తించి ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తామని, ప్రజాప్రతినిధుల సూచనలను పరిగణనలోకి తీసుకుంటూ ముందుకు సాగుతామని చెప్పారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ, ఆర్థికంగా వెనుకబడిన తరగతుల సంక్షేమం, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి పి. విజయలక్ష్మి, పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ, పంచాయతీరాజ్ శాఖ అధికారులు, జిల్లా పరిషత్ సిబ్బంది, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు

# మహిళా సంఘాల ద్వారా కుటుంబాల జీవనోపాధికి బాసట




హిందూపురం, సెప్టెంబర్ 25(మనం న్యూస్): ప్రతి కుటుంబం నుంచి ఒక వ్యాపారవేత్త ప్రతి కుటుంబానికి మెరుగైన జీవనోపాధి.అనే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్రంలో వన్ ఫ్యామిలీ వన్ ఇంటెప్రెన్యూర్ కార్యక్రమం ముందుకు సాగుతోంది. మహిళలు కేవలం స్వయం సహాయక సంఘాల సభ్యులుగా మాత్రమే కాకుండా స్వయం ఉపాధి పొందుతూ వ్యాపారవేత్తలుగా ఎదిగి, తమ కుటుంబాలకు ఆర్థికంగా బాసటగా నిలవడంతో పాటు, ఇతరులకు కూడా ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలనే లక్ష్యంతో మెప్మా ద్వారా వివిధ జీవనోపాధి, ఎంటర్ప్రెన్యూర్షిప్ కార్యక్రమాలు అమలు అవుతున్నాయనీ శుక్రవారం పట్టణంలోని సెంటర్లో పేర్కొన్నారు..ఈ లక్ష్య సాధనలో శ్రీ సత్యసాయి జిల్లా మెప్మా విశేష ప్రగతి నమోదు చేసింది. 2026-27 సంవత్సరానికి సంబంధించిన 96.27 శాతం ప్రగతి సాధించి రాష్ట్రస్థాయిలో ముందంజలో నిలిచింది.

**మహిళ ఎదిగితే కుటుంబం ఎదుగుతుంది**

మెప్మా ద్వారా మహిళా సంఘాల సభ్యులకు స్వయం ఉపాధి, సూక్ష్మ పరిశ్రమలు, నైపుణ్యాభివృద్ధి, రుణ అనుసంధానం, మార్కెట్ అవకాశాలు వంటి అంశాల్లో సహకారం అందిస్తూ కుటుంబాల జీవనోపాధి మెరుగుపడేలా చర్యలు కొనసాగుతున్నాయని జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ వి మల్లికార్జున అన్నారుట.ఒక మహిళ తన కుటుంబానికి ఆదాయాన్ని సమకూర్చుకునే స్థాయి నుంచి తనకే కాకుండా మరొకరికి కూడా ఉపాధి కల్పించే వ్యాపారవేత్తగా ఎదగడం ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశంగా నిలుస్తోంది. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అర్బన్ డెవలప్మెంట్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ సహకారం, శాఖాపరమైన మార్గదర్శకత్వంతో పట్టణ ప్రాంతాల్లో మహిళా సంఘాలు మరియు పట్టణ పేద కుటుంబాలకు జీవనోపాధి, స్వయం ఉపాధి, వ్యాపార అవకాశాలు మరింత చేరువవుతున్నాయి. మెప్మా ఎండీ కరుణ మార్గదర్శకత్వం, కార్యాచరణ ప్రణాళికలు, సలహాలు మరియు సూచనలతో మహిళా సంఘాల జీవనోపాధి మెరుగుదల, స్వయం ఉపాధి మరియు ఎంటర్ప్రెన్యూర్షిప్ కార్యక్రమాలకు మరింత ప్రాధాన్యత లభిస్తోందని తెలిపారు.ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆర్. నాగరాజు నాయకత్వం, పర్యవేక్షణ మరియు మార్గదర్శకత్వంతో పాటు.వాసుదేవ రెడ్డి క్షేత్రస్థాయి సమన్వయం, హిందూపురం డీఎంసీ ఎల్. గంగులయ్య సమన్వయ కృషి ఈ ప్రగతికి బలంగా నిలిచాయి.అదే విధంగా ఆర్ పి లు, సి ఓలు, డిఇఓలు, క్షేత్రస్థాయి సిబ్బంది, మహిళా సంఘాల అధ్యక్షులు సుజాతమ్మ, సరస్వతమ్మ తదితరులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ కార్యక్రమాల పురోగతికి సహకరించారు.




# వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్న కుటుంబాలు

కళ్యాణదుర్గం సెప్టెంబర్ 25(మనం న్యూస్): బ్రహ్మసముద్రం మండల కేంద్రానికి చెందిన కరుడుగట్టిన వైసీపీ కార్యకర్తలు వైసీపీ బూత్ కమిటీ సభ్యుడు ఎమ్ ఆనంద్, ఎమ్ వన్నూరుస్వామి, ఎమ్ పెన్నప్ప, ఎమ్ చనమల్లప్ప, ఆర్ దుర్గప్ప, హెచ్ సోమన్న, డీ శివకుమార్, గుండిగానిపల్లి గ్రామానికి చెందిన కెంచప్ప చంద్రన్న లు వైసీపీని వీడి ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు , మాజీ మంత్రి, జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల ఇంచార్జ్ ఏరాసు ప్రతాప్ రెడ్డి , జిల్లా అధ్యక్షులు పూల నాగరాజుల సమక్షంలో పసుపు కండువా కప్పుకుని టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారిని పార్టీలోకి సాధరంగా ఆహ్వానించారు.

# ఉపాధి హామీ పనులు విస్తృతంగా చేపట్టాలి




ఎమ్మిగనూరు, సెప్టెంబర్ 25(మనం న్యూస్): ఎల్నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొని వ్యవసాయ రంగంలో ఉపాధి అవకాశాలు తగ్గిపోయిన నేపథ్యంలో గ్రామీణ కూలీలకు ఉపాధి కల్పించేందుకు జాతీయ ఉపాధి హామీ పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐ ఎఫ్ టి యూ ) డిమాండ్ చేసింది. ఏడాదికి 250 రోజుల పని, రోజుకు రూ.800 కనీస వేతనం కల్పించాలని కోరింది. ఈ డిమాండ్లతో శుక్రవారం ఐ ఎఫ్ టి యూ ఆధ్వర్యంలో ఎమ్మిగనూరు ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంపీడీఓ కు వినతిపత్రం సమర్పించారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా రైతులు, వ్యవసాయ కూలీలు ఉపాధి కోల్పోయి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నాయకులు పేర్కొన్నారు. గ్రామాల్లో పెద్ద ఎత్తున ఉపాధి హామీ పనులు చేపట్టి కూలీలకు నిరంతర ఉపాధి కల్పించాలని కోరారు. ప్రమాదాలకు గురయ్యే కూలీలకు భద్రత కల్పించాలి

# 25 ఏళ్ల ప్రజా సేవకు ఎరుకల రాజుకు సౌత్ ఇండియా అవార్డ్స్-2026లో ఘన సత్కారం




కర్నూలు సెప్టెంబర్ 25 మనం న్యూస్ః గత 25 సంవత్సరాలుగా ప్రజా సమస్యలపై ఉద్యమిస్తూ, సామాజిక సేవలో నిరంతరం కొనసాగుతున్న ఎరుకల రాజుకు అరుదైన గౌరవం దక్కింది. ప్రజా సేవకు గుర్తింపుగా మాక్ష గ్లోబల్ ఫౌండేషన్ అధ్యక్షులు దినేష్ ఆధ్వర్యంలో తెలంగాణ గ్రంథాలయం సంస్థ చైర్మన్ సినీ ఆర్టిస్ట్ లు మాలిక్ తేజ, రాము రాథోడ్ చేతుల మీదుగా సౌత్ ఇండియా అవారడ్స్ 2026, సీజన్ 5లోబాగంగా ఆయనకు గోల్డెన్ నంది అవార్డ్ 2026 అందజేశారు . నిన్నటి రోజు హైదరాబాద్ నాంపల్లిలోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలో ఈ అవార్డు కార్యక్రమం నిర్వహించారని ఎరుకల రాజు తెలిపారు.

2001 నుంచి ప్రజా ఉద్యమాల బాటలో ఎరుకల రాజు 2001 నుంచి ప్రజా ఉద్యమాలు, సామాజిక కార్యక్రమాలు, ప్రజా సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తూ వస్తున్నారు. ముఖ్యంగా అణగారిన వర్గాలు, ఎరుకల సమాజం ఎదుర్కొంటున్న సమస్యలు, హక్కులు, సంక్షేమం, విద్య, ఉపాధి, సామాజిక న్యాయం తదితర అంశాలపై ప్రజల తరపున తన గళాన్ని వినిపిస్తూ వచ్చారు. సమాజంలో సమస్య ఎదురైనప్పుడు దానిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడం, బాధితులకు అండగా నిలవడం, ప్రజల్లో హక్కులపై అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాల్లో ఆయన చురుకుగా పాల్గొన్నారు.

**ప్రజా సేవలో మరో ముఖ్యమైన అధ్యాయం**

ఎరుకల రాజు గతంలో ఎస్సీ/ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా కూడా పనిచేశారు. ప్రజా సమస్యలు, అణగారిన వర్గాల హక్కులు, సామాజిక న్యాయం వంటి అంశాల్లో తన వంతు బాధ్యతను నిర్వర్తించారు. 2001 నుంచి 2026 వరకు సాగిన ఈ సుదీర్ఘ ప్రజా సేవా ప్రయాణానికి గోల్డెన్ నంది అవార్డు -2026 ద్వారా గుర్తింపు లభించడం ఆయనకు, ఆయనతో కలిసి ప్రజా ఉద్యమాల్లో పనిచేసిన వారికి ఒక ముఖ్యమైన సందర్భంగా నిలిచింది.

**ఈ గౌరవం ప్రజలది**

తనకు లభిస్తున్న ఈ అవార్డు వ్యక్తిగత గౌరవం మాత్రమే కాదని, ప్రజా సమస్యల కోసం పోరాడుతున్న ప్రతి సామాజిక కార్యకర్తకు దక్కిన గుర్తింపుగా ఎరుకల రాజు పేర్కొన్నారు. ప్రజల కోసం చేసిన సేవే నా జీవితానికి అసలైన గౌరవం. ఈ అవార్డు నా 25 ఏళ్ల ప్రజా సేవకు లభించిన గుర్తింపుగా భావిస్తున్నాను. భవిష్యత్తులో కూడా ప్రజా సమస్యల పరిష్కారం, సామాజిక న్యాయం కోసం నా పోరాటం కొనసాగిస్తాను అని ఎరుకల రాజు తెలిపారు.

# 11 నుంచి ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రి మహోత్సవాలు

- ఆర్జిత సేవా టికెట్ల విడుదల

విజయవాడ, సెప్టెంబర్ 25 : కనకదుర్గమ్మ అమ్మవారు కొలువైన విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రి మహోత్సవాలకు ప్రత్యక్ష, పరోక్ష ఆర్జిత సేవా టికెట్లను శుక్రవారం లాంఛనంగా విడుదల చేశారు. అక్టోబర్ 11 నుంచి 20 వరకు జరగనున్న ఈ ఉత్సవాల టికెట్లను దేవస్థానం ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో వీకే శీనానాయక్, స్థానాచార్యులతో కలిసి ఆవిష్కరించారు. దేవస్థానం నూతన పూజా మండపంలో శాస్త్రోక్తంగా నిర్వహించనున్న ప్రత్యేక ఖడ్గమాలార్చన, ప్రత్యేక కుంకుమార్చన, చండీయాగం, శ్రీచక్రనవావరణార్చన సేవలను భక్తులు ఇంటి వద్ద నుంచే పరోక్షంగా వీక్షించవచ్చు. పూజా సమయంలో భక్తుల పేర్లు, గోత్రాలను అమ్మవారి సన్నిధిలో అర్చకులు చదువుతారు. భక్తులు లైవ్ లింక్ ద్వారా ఈ పూజలను తిలకించవచ్చు. సేవా టికెట్లను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ దేవాదాయ శాఖ అధికారిక పోర్టల్ ద్వారా లేదా ఏపీ ప్రభుత్వ 'మనమిత్ర' అధికారిక వాట్సాప్ గవర్నెన్స్ నెంబర్ 9552300009 ద్వారా అత్యంత సులభంగా ఆన్లైన్లో బుక్ చేసుకోవచ్చని ఈవో శీనానాయక్ తెలిపారు. ఒక రోజు పూజా టికెట్ రుసుము రూ.1,500, పది రోజులకు ప్యాకేజీ రుసుము: రూ.11,116/- (నవరాత్రుల మొత్తం 10 రోజులకు)గా నిర్ణయించారు. ఉత్సవాలు ముగిసిన తర్వాత భక్తుల చిరునామాకు తపాలా ద్వారా అమ్మవారి శేష వస్త్రం, రవిక ముక్క, శ్రీచక్ర పీఠం, ల్యామినేషన్ ఫొటో, కుంకుమ భరిణె, రక్షా కంకణాలను పంపిస్తారు. పరోక్ష సేవా టికెట్లు కొనుగోలు చేసిన భక్తులకు నేరుగా దేవస్థానంలో పూజల్లో పాల్గొనేందుకు గానీ, అమ్మవారి దర్శనానికి గానీ ఎలాంటి అనుమతి ఉండదు. దూర ప్రాంతాల నుంచి రాలేని భక్తులు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని దేవస్థానం ఛైర్మన్, ఈవో సూచించారు.




# బీసీలకు శాశ్వత సామాజిక వేదిక

- ఎల్.సి.కె.పురంలో రూ.కోటి వ్యయంతో బీసీ భవనం
- మూడు నెలల్లో పూర్తి చేయాలని లక్ష్యం
- మంత్రి సత్యకుమార్ యాదవ్

ధర్మవరం, సెప్టెంబరు 25, మనం న్యూస్: బీసీ కుటుంబాల సామాజిక అవసరాలకు ఉపయోగపడేలా ధర్మవరం పట్టణంలోని ఎల్.సి.కె.పురంలో రూ.కోటి వ్యయంతో బీసీ సామాజిక భవనం నిర్మించనున్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్య శాఖ మంత్రి, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ తెలిపారు. శుక్రవారం భవన నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఎంపీ లాడ్స్ నిధుల నుంచి ఎంపీలు బి.సత్యనారాయణ, ఆర్.కృష్ణయ్య చెరో రూ.50 లక్షలు కేటాయించడంతో భవన నిర్మాణానికి నిధులు సమకూరాయని మంత్రి తెలిపారు. సుమారు రెండు సెంట్ల స్థలంలో నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. పనులను మూడు నెలల్లో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.

# పంట నష్టాలపై తక్షణ సర్వే..

- దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు
- నీరు నిలిచిన పొలాల్లో పంటల రక్షణకు చర్యలు చేపట్టాలి
- వర్షపు నీటిని సంరక్షించి.. సాగు, తాగునీటి అవసరాలకు వినియోగించాలి
- ఉన్నతాధికారులు, మూడు జిల్లాల కలెక్టర్లతో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సమీక్ష



అమరావతి, సెప్టెంబర్ 25,(మనం ప్రత్యేక ప్రతినిధి): తీవ్ర వాయుగుండం ప్రభావంతో రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలు, ఈదురు గాలుల వల్ల జరిగిన పంట నష్టాన్ని తక్షణమే అంచనా వేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. దెబ్బతిన్న రహదారులు, ఇతర మౌలిక సదుపాయాల నష్ట వివరాలను సేకరించి, అత్యవసర పునరుద్ధరణ పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని సూచించారు. ప్రభావిత ప్రాంతాల్లో రైతులకు, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత శాఖలు, జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. భారీ వర్షాల ప్రభావం, తక్షణం చేపట్టాల్సిన చర్యలపై వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బూడితి రాజశేఖర్, వ్యవసాయ శాఖ కమిషనర్ జిలానీ, ఉద్యాన శాఖ కమిషనర్ శ్రీనివాసులు, పశుసంవర్ధక శాఖ డైరెక్టర్, మత్స్యశాఖ కమిషనర్ తదితర ఉన్నతాధికారులతో మంత్రి ప్రత్యేక టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. అలాగే పార్వతీపురం మన్యం, డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ, శ్రీకాకుళం జిల్లాల కలెక్టర్లతో టెలీకాన్ఫరెన్స్లో ఆయా ప్రాంతాల్లో పరిస్థితులను సమీక్షించి, సహాయక చర్యలు, మౌలిక సదుపాయాల పునరుద్ధరణపై దిశానిర్దేశం చేశారు.

వ్యవసాయ, ఉద్యాన పంటలకు జరిగిన నష్టంపై క్షేత్రస్థాయిలో వెంటనే సర్వే చేపట్టి, నష్ట వివరాల నమోదు (ఎన్యూమరేషన్) ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. పొలాల్లో నీరు నిలిచిన ప్రాంతాలను సంబంధిత అధికారులు సందర్శించి, పంటల పరిస్థితిని పరిశీలించాలన్నారు. నిల్వ నీటిని తొలగించడం, అధిక తేమ వల్ల మరింత నష్టం వాటిల్లకుండా నివారించడం వంటి అంశాలపై రైతులకు అవసరమైన సాంకేతిక సలహాలు అందించాలని సూచించారు. పంటల రక్షణకు అనుసరించాల్సిన పద్ధతులపై క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. వర్షాలు, గాలులకు దెబ్బతిన్న రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాల వివరాలను వెంటనే నమోదు చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. ప్రజల రాకపోకలకు ఆటంకం కలిగించే ముఖ్యమైన రహదారులను గుర్తించి, అత్యవసర మరమ్మతులకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, అవసరమైన సహాయక, పునరుద్ధరణ చర్యలను వేగవంతం చేయాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ఎల్నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో, ప్రస్తుతం కురుస్తున్న వర్షాల ద్వారా లభిస్తున్న నీటిని సాధ్యమైనంత మేర సంరక్షించుకోవాలని మంత్రి సూచించారు. చెరువులు, జలాశయాలు, ఇతర నీటి వనరుల్లో నీటిని నిల్వ చేసి, భవిష్యత్తు సాగు, తాగునీటి అవసరాలకు సమర్థంగా వినియోగించుకునేలా పక్కా ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్లను ఆదేశించారు. పంటలకు హాని కలిగించే నిల్వ నీటిని తొలగిస్తూనే, అనువైన ప్రాంతాల్లో వర్షపు నీటి సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. నీటిని పొదుపుగా వినియోగించుకునే పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక, మత్స్య శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి, వర్ష ప్రభావిత ప్రాంతాల్లో అవసరమైన చర్యలను ఆలస్యం లేకుండా చేపట్టాలని అచ్చెన్నాయుడు ఆదేశించారు. రైతులకు క్షేత్రస్థాయిలో మార్గదర్శనం అందించడం, ప్రజలకు అవసరమైన సహాయం చేరవేయడం, దెబ్బతిన్న సదుపాయాలను పునరుద్ధరించడం వంటి పనులకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు.

